● తెలుగు భాషా దినోత్సవం

● జాతీయ క్రీడా దినోత్సవం



తెలుగు పండితులను సత్కరిస్తున్న జేసీ శుభం బన్సల్

వాడుక భాషకోసం ఉద్యమించారు. తెలుగు భాష ఔన్నత్యానికి కృషి చేశారు గిడుగు వెంకటరామమూర్తి. అందుకే ఆయన పుట్టిన రోజును తెలుగు భాషా దినోత్సవంగా జరుపుకొంటున్నారు.

ఒలింపిక్స్‌లో మూడుసార్లు స్వర్ణ పతకాలను సాధించడంలో హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ కీలక పాత్ర పోషించారు. అందుకే ఆయన జన్మదినాన్ని క్రీడా దినోత్సవంగా జరుపుకొంటారు.

ఈ ఇద్దరి జయంతిని పురస్కరించుకుని శుక్రవారం జిల్లా వ్యాప్తంగా తెలుగు భాషా.. క్రీడా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు.



ధ్యాన్‌చంద్ విగ్రహం వద్ద అధికారులు, హాకీ క్రీడాకారులు

■ 'తెలుగు' ఔన్నత్యాన్ని తెలుసుకోండి

'తెలుగు భాష ఔన్నత్యాన్ని గుర్తించండి. ప్రాముఖ్యతను తెలుసుకోండి. తెలుగు భాషపై మక్కువ చూపండి' అంటూ పిల్లలకు జేసీ శుభం బన్సల్ పిలుపునిచ్చారు. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో శుక్రవారం తెలుగు భాష దినోత్సవం నిర్వహించారు. గిడుగు వెంకటరామమూర్తి జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి అధికారులు నివాళులర్పించారు. గ్రాంధిక భాష వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్న రోజుల్లో.. వ్యవహారిక భాషోద్యమానికి గిడుగు శ్రీకారం చుట్టారని జేసీ గుర్తుచేసుకున్నారు. 'ఇంగ్లిష్ మాధ్యమంతో తెలుగు మాట్లాడటం అరుదుగా మారింది. పిల్లలూ తెలుగులో చదవండి. రాయండి. మాట్లాడండి. ప్రతిరోజూ తెలుగు పత్రికలు చదవండి. వేమన, సుమతి శతకాలను అవగాహన చేసుకోండి' అని డీఆర్వో నరసింహులు కోరారు. తెలుగుభాషకు సేవ చేస్తున్న పండితులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డీసీలు శివశంకరనాయక్, రోజ్మాండ్, పర్యాటకశాఖ జిల్లా అధికారి జనార్దన్‌రెడ్డి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

- తిరుపతి(కలెక్టరేట్), ఆంధ్రజ్యోతి

■ నచ్చిన ఆట ఆడండి

'ఆధునిక క్రీడలతో పాటు ప్రాచీన భారతీయ ఆటల్లో మీకు నచ్చినవి ఆడండి. దీనివల్ల మానసిక ఉల్లాసం కలుగుతుంది. మేధస్సు చురుగ్గా ఉంటుంది. చదువులో చురుగ్గా రాణిస్తారు' అంటూ పలువురు పిలుపునిచ్చారు. ప్రముఖ హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా శుక్రవారం జిల్లా క్రీడాభివృద్ధి అధికారి శశిధర్ ఆధ్వర్యంలో తిరుపతి శ్రీనివాస క్రీడా సముదాయంలోని ఆయన విగ్రహానికి గజమాల వేశారు. క్రీడాకారులు హాకీ స్టిక్స్‌ను ప్రదర్శిస్తూ నివాళులర్పించారు. రాష్ట్రస్థాయి క్రీడల్లో రాణించిన వారికి డీఎస్‌డీవో, సెట్విన్ సీఈవో మోహన్‌కుమార్ జ్ఞాపికలను ప్రదానం చేశారు. ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు వై.ప్రవీణ్, ఆర్.శ్రీధర్, ప్రతినిధులు సాయికుమార్, విజయ్‌కుమార్, శివప్రసాద్, శాప్ కోచ్‌లు గోపి, వినోద్, హిందుజ, సాయిసుమతి, ఆది, హరి, ప్రేమ్‌నాథ్, తైక్వాండో, ఫుట్‌బాల్, బాక్సింగ్ అసోసియేషన్ల తరఫున గోపీనాయుడు, రెడ్డెప్ప, కైలాష్ పాల్గొని ధ్యాన్‌చంద్ సేవలను స్మరించుకున్నారు. ఎస్వీయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఎం.శివశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో హాకీ క్రీడాకారులు జాతీయ జెండాను ప్రదర్శించారు.

- తిరుపతి(క్రీడలు), ఆంధ్రజ్యోతి



గుడుపల్లె సమీపంలో నిండుగా ప్రవహిస్తున్న హంద్రీ-నీవా కాలువ

బాబు భగీరథ ప్రయత్నం ఫలించిన వేళ!

● పరుగులు పెట్టి కుప్పం చేరుకున్న కృష్ణమ్మ

కుప్పం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఎక్కడి శ్రీశైలం.. ఎక్కడి కుప్పం? మధ్యలో 738 కిలోమీటర్ల దూరం. ప్రతిపక్ష వైసీపీ పాలనలో మధ్యలో అయిదేళ్ల నిర్లక్ష్యం. ఈ అయిదేళ్లకు అటు అయిదేళ్లు, ఇటు ఏడాది.. ఆరేళ్లపాటు సాగిన చంద్రబాబు భగీరథ ప్రయత్నం. హంద్రీ - నీవా బ్రాంచి కాలువ రూపంలో ముఖ్యమంత్రి సంకల్పం సాకారమైంది. కృష్ణమ్మ పరుగులు పెట్టి వచ్చి కరువు నేల కుప్పాన్ని పావనం చేస్తోంది. గత నెల 17వ తేదీన కర్నూలు జిల్లా మల్యాల ఎత్తిపోతల నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు హంద్రీ-నీవా కాలువలోకి నీటిని విడుదల చేశారు. ఆ నీళ్లు 738 కిలోమీటర్లు ప్రయాణించి ఈనెల 23వ తేదీ అర్ధరాత్రి రామకుప్పం మండలం వర్దికుప్పం వద్ద కుప్పం నియోజకవర్గంలో ప్రవేశించాయి. కుప్పం మండలంలోని గమ్యస్థానమైన పరమసముద్రం చెరువుకు 25వ తేదీన కృష్ణా జలాలు చేరుకున్నాయి. వీటితో కుప్పం, పలమనేరు నియోజకవర్గాల్లోని 8 మండలాల పరిధిలో ఉన్న 110 చెరువులు నింపనున్నారు. తద్వారా 6,300 ఎకరాలకు సాగు.. 4.02 లక్షలమందికి తాగునీరు అందనుంది. కాగా, కుప్పం మండలం పరమసముద్రం చెరువు సమీపంలో ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం జలహారతి ఇవ్వనున్నారు. అక్కడే పైలాన్ ఆవిష్కరించి, బహిరంగ సభలో నియోజకవర్గ ప్రజలనుద్దేశించి ప్రసంగించనున్నారు. దీనికోసం ఆయన శుక్రవారం సాయంత్రం కుప్పం చేరుకున్నారు.



చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే పులివర్తి నాని తదితరులు

ఏకదంతుడి రూపాలెన్నో!



పడవలో కృష్ణుని తీసుకెళుతూ..

సింగాలగుంట: ఉయ్యాలలో..

పల్లెవీధి: బాల వినాయకుడు

కొత్తవీధి: ఆంజనేయస్వామి రూపంలో..

ఎందరో దేవతామూర్తుల రూపంలో తిరుపతి నగర కూడళ్లలో వినాయకులు కొలువుదీరారు. డ్రమ్స్ వాయిద్య కారుడిలా.. చీరలు.. రాగి కలశాలు.. ఇలా ఎవరికి నచ్చినట్లు వారు గణేశుడి ప్రతిమలను విభిన్నంగా తీర్చిదిద్దారు. ఎంతో ఆకర్షణీయంగా ఉన్న ఏకదంతుడి ప్రతిమలను శుక్రవారం కూడా స్థానికులు సందర్శించి.. మొక్కులు తీర్చుకున్నారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

జ్యోతి థియేటర్ రోడ్డులో..

డీఆర్ మహల్ రోడ్డు: శారీ గణపతి

మంచినీళ్లగుంట: కాళికామాత రూపుడై..

ఊటగుంట: రాగి కలశాలతో వినాయకుడు

అన్నారావు సర్కిల్: 'డ్రమ్స్' గణేశ

అప్పీలు చేసుకున్న వారికి ఒకటిన పింఛను



తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): అనారోగ్య, దివ్యాంగుల పింఛన్లకు సంబంధించి నోటీసులు అందుకున్న వారందరూ శనివారం సాయంత్రం లోపు అప్పీల్ చేసుకోవాలని, అలాంటి వారికి మాత్రమే సెప్టెంబరు ఒకటో తేదీన పింఛను ఇస్తామని కలెక్టర్ వెంకటేశ్వర్ శుక్రవారం తెలిపారు. టెలీ కాన్ఫరెన్సు ద్వారా అధికారులతో మాట్లాడుతూ పింఛన్ల రీ వెరిఫికేషన్‌లో భాగంగా నోటీసులు అందుకున్న దివ్యాంగులు అప్పీల్ చేసుకోవాలని, వారికి అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. అప్పీల్ చేసుకోకపోతే పింఛను రాదని స్పష్టం చేశారు. ఇక ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్లు సెప్టెంబరు నెలకు సంబంధించి 2,63,350మంది లబ్ధిదారులకు రూ.112.36కోట్లు నిధులు కేటాయించినట్లు చెప్పారు. సోమవారం ఉదయం నుంచే అందజేయాలని అధికారులను ఆదేశించారు.

15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయాలి



మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్

తిరుపతి(ఎమ్మార్‌పల్లె), ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేదని, పెండింగ్‌లో ఉన్న 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయాలని పంచాయతీరాజ్ ఛాంబర్ జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ యలమంచిలి బాబు రాజేంద్రప్రసాద్ కోరారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం కేంద్రం గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం విడుదల చేసిన నిధులను దారి మళ్లించిందని గుర్తుచేశారు. తద్వారా గ్రామాల్లో సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందిపడ్డారని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న 15వ ఆర్థిక సంఘం నిధులు సెప్టెంబరులో విడుదల చేయనున్నట్లు ప్రభుత్వం చెప్పిందని, అదే జరిగితే గ్రామ పంచాయతీలు మరింతగా అభివృద్ధి చెందుతాయని అన్నారు. పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ నిధులు, సర్పంచ్, ఎంపీటీసీ, ఎంపీపీల గౌరవ వేతనాలు ఇవ్వాలని కోరారు. తెలంగాణ పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షుడు చెంపుల సత్యనారాయణరెడ్డి, సర్పంచుల సంఘం తెలంగాణ గౌరవాధ్యక్షుడు నరేంద్ర మాట్లాడుతూ గ్రామాల్లో సౌకర్యాలు కల్పిస్తే పర్యావరణ హితానికి తోడ్పాటు అందించిన వారమవుతామన్నారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ ఛాంబర్ ఉపాధ్యక్షులు సింగంశెట్టి సుబ్బరామయ్య, వేణుగోపాల్, మురళి, అనిల్ పాల్గొన్నారు.

తిరుపతిలో పోలీస్ బాస్‌లు

● సమన్వయ కమిటీ సమావేశానికి దక్షిణాది రాష్ట్రాల ఉన్నతాధికారుల రాక

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): దక్షిణాదిలోని మూడు రాష్ట్రాల డీజీపీలు. ఐదు రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల నుంచి ఉన్నతస్థాయి పోలీసు అధికారులు. ఇలా 48 మంది ఉన్నతాధికారులతోపాటు బీఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్, సీఐఎస్ఎఫ్, సీబీఐ, ఎన్ఐఏ, ఎన్‌సీబీ అధికారులు తిరుపతిలో సమావేశమయ్యారు. ఆయా రాష్ట్రాల మధ్య పరస్పర సహకారం, సమన్వయం, అక్రమ రవాణా, అంతర్రాష్ట్ర దొంగలను కట్టడి చేయడం, సైబర్ నేరాలు, మహిళా ట్రాఫికింగ్, సోషల్ మీడియాలో రెచ్చగొట్టే అంశాలపై నిఘా ఉంచడం, డ్రగ్స్ ముఠా ఆట కట్టించడం, సమాచార మార్పిడి తదితర విషయాలపై దాదాపు ఎనిమిది గంటల పాటు చర్చించారు. తమకు ఎదురైన సవాళ్లను ఎదుర్కొనడానికి అన్ని రాష్ట్రాలు కలిసి తీసుకోవాల్సిన చర్యలను ఏపీ డీజీపీ హరీష్ కుమార్ గుప్తా వివరించారు. కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఇంతమంది పోలీసు ఉన్నతాధికారులు రావడంతో గ్రాండ్ రిడ్జ్ వద్ద భారీ భద్రత ఏర్పాటు చేశారు. తనిఖీలు ముమ్మరం చేశారు. వాహనాలను దారి మళ్లించారు. కొందరు పోలీసు అధికారులు గురువారం రాత్రే తిరుపతికి చేరుకున్నారు. వీరిలో కొందరు తిరుమల వెళ్లి శుక్రవారం ఉదయం శ్రీవారిని దర్శించుకుని సమావేశానికి వచ్చారు. మరికొందరు శనివారం శ్రీవారిని దర్శించుకుని తిరుగు ప్రయాణం కానున్నారు. ఈ సమావేశానికి హాజరైన వారి కోసం ఎస్పీ హర్షవర్ధనరాజు ఆధ్వర్యంలో అధికారులు బస, భోజనం, సమావేశ ఏర్పాట్లు పక్కాగా చేశారు. ఈ సమావేశంలో ఏపీ డీజీపీతో పాటు కేరళ డీజీపీ రావాడ చంద్రశేఖర్, పుదుచ్చేరి డీజీపీ శాలిని సింగ్, ఎనిమిది మంది అదనపు డీజీలు, 9 మంది ఐజీలు, 12 మంది డీఐజీలు, 16 మంది ఎస్పీలు, కేంద్ర భద్రత బలగాల వింగ్‌ల నుంచీ అధికారులు హాజరయ్యారు.



సమావేశానికి వస్తున్న డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా

నేడు తిరుపతి-కాచిగూడ మధ్య ప్రత్యేక రైలు

తిరుపతి(సెంట్రల్), ఆగస్టు29 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో రద్దీని దృష్టిలో ఉంచుకుని తిరుపతి-కాచిగూడ మధ్య ప్రత్యేక రైలు ఏర్పాటు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ శ్రీధర్ తెలిపారు. కాచిగూడలో శుక్రవారం రాత్రి ఈ ప్రత్యేక రైలు(02794) బయలుదేరి శనివారం మధ్యాహ్నం తిరుపతికి చేరుకుంటుంది. తిరుపతిలో ఈ ప్రత్యేక రైలు(02793) శనివారం రాత్రి 9.10 గంటలకు బయలుదేరి రేణిగుంట, రాజంపేట, కడప, తాడిపత్రి, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్డు, రాయచూర్, కృష్ణ, యాద్‌గిర్, సేడం, తాండూరు, వికారాబాద్, లింగంపల్లి, సికింద్రాబాద్ మీదుగా కాచిగూడకు మరుసటి రోజు ఉదయం 11 గంటలకు చేరుకుంటుందని తెలిపారు.

స్మార్ట్ కార్డుల పంపిణీకి చర్యలు



మాట్లాడుతున్న ఎంపీపీ బ్రహ్మానందరెడ్డి

రామచంద్రాపురం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మండలంలో అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా పేదలకు మెరుగైన సేవలు అందిద్దామని ఎంపీపీ బ్రహ్మానంద రెడ్డి అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. తహసీల్దారు మధుసూదన్‌రావు మాట్లాడుతూ మండలంలో 9,611 స్మార్ట్‌కార్డులను పంపిణీ చేయనున్నామన్నారు. ఉద్యానవనశాఖ అధికారి శివకుమారి మాట్లాడుతూ 361 మంది మామిడి రైతుల ఖాతాలకు రూ.70లక్షల మేర రాయితీ త్వరలో జమచేస్తారు. ఎంపీడీవో చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కారవేదికలో సమస్యలను పరిష్కరించుకోవాలని ప్రజలకు సూచించారు. రామాపురంలో వాగు పొరంబోకు స్థలంలో ఆక్రమణలు తొలగించాలని జడ్పీటీసీ డిల్లీరాణి ఇరిగేషన్, రెవెన్యూ అధికారులను కోరారు. కార్యక్రమంలో అధికారులు పవన్‌కుమార్‌రాజు, మహేష్‌నాయుడు, శంకర్‌నాయుడు, ఎంపీటీసీలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడావిజేతలకు బహుమతుల ప్రదానం


బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

పాకాల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో క్రీడావిభాగం ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ క్రీడాదినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ మాశిలామణి, క్రీడావిభాగం సమన్వయకర్త ఆదిశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. మొగరాల జడ్పీహైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎం సుమలత పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా కుడుములతో గణపతి హోమం



రామచంద్రాపురం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రాయలచెరువుకట్ట శక్తిపీఠంలో శుక్రవారం శాస్త్రోక్తంగా లక్ష మోదకాలు(కుడుములు)లతో హోమం జరిగింది. మరకతశక్తి కాళీ అమ్మవారితో పాటు విజయగణపతి మూలమూర్తులకు తిరుమంజనం నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేపట్టారు. ఉదయం 9గంటలకు లక్ష మోదకాలతో గణపతి హోమం ప్రారంభించగా శక్తి పీఠాధీశ్వరి రమ్యానందభారతి పూర్ణాహుతితో ముగించారు. కుర్తాళం పీఠాధిపతి సిద్దేశ్వరానంద భారతి విజయగణపతి స్వామికి మంగళహారతులు ఇచ్చారు. మధ్యాహ్నం అన్నదానం జరిగింది. పీఠం కార్యదర్శి శ్రీకాంత్ పాల్గొన్నారు.

తిరుచ్చిపై శ్రీవారి దేవేరి సాక్షాత్కారం



తిరుచానూరు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారికి శుక్రవారం సాయంత్రం బంగారు తిరుచ్చి ఉత్సవం జరిగింది. ఉదయం మూలవర్లకు సుగంధ అభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం వేదమంత్రోచ్చరణల మధ్య స్నపన తిరుమంజనం చేశాక సాయంత్రం ఊంజల్ సేవ జరిగింది. అనంతరం సర్వాలంకార శోభితురాలైన పద్మావతిదేవి బంగారు తిరుచ్చి కొలువుదీరి భక్తులను కటాక్షించారు. డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్, సూపరింటెండెంట్ రమేష్, అర్చకులు బాబుస్వామి, మణికంఠస్వామి, ఇన్‌స్పెక్టర్లు ప్రసాద్, చలపతి, సుభాస్కర్ నాయుడు, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

గిడుగు రామ్మూర్తికి నివాళులు


గిడుగు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న అధ్యాపకులు

పాకాల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తెలుగు బాషా ఉద్యమకారుడు గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గిడుగు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జిల్లా రచయితల సంఘం కార్యదర్శి డాక్టర్ గంగాధరప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పీలేరు, శ్రీకాళహస్తి డిగ్రీ కళాశాలల అధ్యాపకులు వెంకటరమణయ్య, సాయివెంకటేష్‌లు ప్రసంగించారు. ఓబులశెట్టివారిపల్లె జడ్పీ హైస్కూల్‌లో తెలుగు భాషోపాధ్యాయుడు జ్యోతి వెంకటరత్నం, హెచ్‌ఎం కుమార్‌రెడ్డిల ఆధ్వర్యంలో. వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ మాశిలామణి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు


పిరమిడ్ ఆకృతిలో కూర్చున్న విద్యార్థులపై వినూత్నంగా ధ్యానం చేస్తున్న విద్యార్థి

తిరుపతిరూరల్, ఆగస్టు29(ఆంధ్రజ్యోతి):ఎంఆర్‌పల్లె జెడ్పీహైస్కూల్‌లో క్రీడాదినోత్సవం సందర్భంగా శుక్రవారం విద్యార్థులకు వ్యాసరచన,ఆటల పోటీలు నిర్వహించారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పిరమిడ్ ఆకారంలో కూర్చుని జాతీయజెండాని ప్రదర్శించడం,వినూత్నంగా ధ్యానం చేయడం వంటివి ఆకట్టుకున్నాయి. హెచ్‌ఎం ఆర్.హరినాథ్‌రెడ్డి, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులపై రైతుల్లో జాగృతి


వేదికపై జిల్లావ్యవసాయాధికారి, తదితరులు

తిరుపతి(గాంధీరోడ్డు), ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో వరిసాగులో యాజమాన్య పద్ధతులను అనుసరించేలా రైతులను చైతన్య పరచాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్. ప్రసాదరావు పేర్కొన్నారు. ఎల్ఐసీరోడ్డులోని వ్యవసాయశాఖ కార్యాలయంలో డివిజన్‌స్థాయి రైతుసేవా కేంద్ర సిబ్బందికి సామర్థ్య పెంపుపై శుక్రవారం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ..శాస్త్రీయ పద్ధతుల్లో వరిని సాగు చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. జిల్లా వనరుల కేంద్రం ఏవో శ్రీనివాస్ మాట్లాడుతూ.. పంటలో కాలిబాటలు, సిఫారసు మేరకే నత్రజని ఎరువుల వినియోగం, సమగ్ర సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించాలన్నారు. మండల వ్యవసాయాధికారులు, హార్టికల్చర్ అధికారి బిందు, ఏఈవో మహేష్, సురేష్, రైతుసేవాకేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం



వినాయకుడ్ని దర్శించుకున్న జయచంద్రారెడ్డి-అన్నదానం చేస్తున్న హనుమంతరెడ్డి

తిరుపతి రూరల్, ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): గాంధీపురం పంచాయతీ ధనలక్ష్మినగర్‌లోని విజయ వినాయకస్వామి ఆలయం వద్ద నందివాహనంపై కొలువుదీరిన ప్రతిమ ఆకట్టుకుంది. సివిల్ సప్లైస్ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ సైకం జయచంద్రారెడ్డి దర్శించుకున్నారు. . టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు ధనారాయల్, తదితరులు పాల్గొన్నారు. ●తుమ్మలగుంటలో ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయం వద్ద టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు పార్లపల్లి భరత్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. టీడీపీనేత, ధ్యానసాయి ఏజెన్సీస్ అధినేత బిరుదాల హనుమంతరెడ్డి నిర్వహించారు. టీడీపీ నాయకులు బిరుదాల సిద్దారెడ్డి, రాధారాయల్, రోహిత్, గురవారెడ్డి, సుబ్రమణ్యం, యువత శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రగిరి

ఎమ్మెల్యే నానిని కలిసిన అమెరికా మంత్రి బద్రీనాథ్


బద్రీనాథ్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే నాని

తిరుచానూరు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): తనపల్లి రఘునాథ్ రిసార్ట్‌లోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం అమెరికా మంత్రి లంకెల్ల బద్రీనాథ్ ఎమ్మెల్యే పులివర్తి నానిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను నాని శాలువాతో సత్కరించారు. అనంతరం ఇరువురు పలు విషయాలపై చర్చించుకున్నారు. చంద్రగిరిలో పుట్టి చదివి అమెరికాలో విన్‌స్కాన్ రాష్ట్రంలో మంత్రి కావడం ఆనందంగా ఉందని నాని అన్నారు. లంకెల్ల లలిత తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం తెలంగాణ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, కేరళ డీజీపీ చంద్రశేఖర్, ఎమ్మెల్యే ఆదిమూలం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

ఎయిడ్స్‌పై అవగాహన

ఎర్రావారిపాలెం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ వ్యాధిపై ప్రతి ఒక్కరు అవగాహన కల్గి ఉండాలని వైద్యాధికారి సుమత్ అన్నారు. శుక్రవారం చింతగుంట పంచాయతీ పసుపులేటివారిపల్లెలో ఎయిడ్స్ వ్యాధి సంక్రమణ,హెచ్ఐవీ వైరస్ నిర్మూలన ,నియంత్రణలపై కోర్ స్వచ్ఛంద ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టరు సుమంత్, కోర్ సంస్థ ప్రతినిధులు తులసి, ఎంపీహెచ్ అలేఖ్య, ఆశా వర్కర్లు గీతా,ఈశ్వరమ్మ, ఎన్ఎం సుగుణ పాల్గొన్నారు.

పౌర సరఫరాల గోదాం తనిఖీ



చంద్రగిరి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పౌరసరఫరాల శాఖ గోదాంను విజిలెన్సు అధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. విజిలెన్సు సీఐ వెంకటరవి పర్యవేక్షణలో ఎస్ఐ రామకృష్ణ నాయక్ సిబ్బందితో కలిసి గోదాము ఇన్‌చార్జి ప్రసాద్ వద్ద ఉన్న రికార్డులను పరిశీలించారు. స్టాకుపై క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. స్వల్ప తేడాలున్నట్లు గుర్తించారు. తనిఖీల్లో గోదాం డీటీ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఒడిశా గవర్నర్‌ను కలిసిన టీడీపీ నేతలు


హరిబాబుతో అప్పలనాయుడు, మాధవులనాయుడు

పిచ్చాటూరు, ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబును భువనేశ్వర్‌లోని రాజ్‌భవన్‌లో శుక్రవారం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు వెంపటి మాధవులనాయుడులు మర్యాదపూర్వకంగా కలిశారు.

నిత్యాన్నదానానికి విరాళం



శ్రీకాళహస్తి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యం లో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి తిరుపతి చెందిన సుబ్రహ్మణ్యం, జయలక్ష్మమ్మ దంపతులు శుక్రవారం రూ.50వేలు విరాళంగా అందజేశారు. అధికారులు దాతలకు దర్శన ఏర్పాట్లు చేశారు

ముక్కంటి సేవలో ప్రముఖులు

శ్రీకాళహస్తి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శుక్రవారం పలువురు ప్రముఖులు వేర్వేరు సమయాల్లో దర్శించుకున్నారు. రాజస్తాన్ హైకోర్టు జడ్జి మున్నూరి లక్ష్మణ్, కేరళ హైకోర్టు జడ్జి ఈశ్వరన్ దర్శించుకున్న వారిలో ఉన్నారు. వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయ స్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల తీర్థప్రసాదాలు అందజేశారు.

స్పేర్‌పార్ట్స్ దుకాణంలో అగ్నిప్రమాదం

నాయుడుపేట టౌన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట రైల్వే స్టేషన్‌కు ఎదురుగా ఉన్న స్పేర్ పార్ట్స్ దుకాణంలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. శుక్రవారం సాయంత్రం యజమాని తన సొంత పనుల నిమిత్తం దుకాణాన్ని మూసివేసి ఇంటికి వెళ్లాడు. కొంత సమయం తరువాత షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి పొగ అలుముకోవడంతో సమీపంలో ఉన్న దుకాణదారులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది చేరుకొని మంటలను అదుపుచేశారు. అప్పటికే దుకాణంలో ఉన్న రూ.7 లక్షలు విలువచేసే సామాగ్రి దగ్ధమైనట్లు బాధితుడు ఫిర్యాదు చేశాడు.

కోట: పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల వీధిలో శుక్రవారం షార్ట్‌సర్క్యూట్‌తో ఆక్వాఫీడ్ దుకాణం దగ్ధమైంది. ఇక్కడ రొయ్యల మేతలు, కెమికల్స్ దుకాణాన్ని శ్రీధర్‌రెడ్డి నడుపుతున్నారు. తెల్లవారుజామున దుకాణంలోని విద్యుత్ వైర్లు షార్ట్ సర్క్యూట్‌కు గురై మంటలు ఎగిశాయి. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా అప్పటికే లక్షలాది రూపాయలు విలువచేసే రొయ్యల మేతలు, కెమికల్స్, మోటార్లు కాలి దగ్ధమయ్యాయి.

గోడలకే పరిమితం నాడు-నేడు పనులు


పునాదులతో ఆగిన పనులు


పాకాల హైస్కూల్లో గోడలకే పరిమితమైన పనులు

పాకాల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మూడేళ్ల క్రితం రూ.1.98 కోట్లతో చేపట్టిన నాడు నేడు అభివృద్ధి పనులు మొండిగోడలకే పరిమితమయ్యాయి. 13 తరగతి గదులు నిర్మించడానికి 2వ అంతస్తుపైన పిల్లర్లు నిర్మించి గోడలు కట్టారు. స్లాబ్ దశలో ఇంజనీరింగ్ అధికారుల అభ్యంతరంతో పనులు నిలిపివేశారు. పై అంతస్థులు స్లాబ్ వేస్తే కింద రెండు అంతస్తులు దెబ్బతింటాయని వదిలేశారు. ఉన్న భవనాలపై పిల్లర్లు వేయడంతో వర్షాలకు గోడలు నాని గదుల్లో చెమ్మచేరుతోంది. కొంతకాలానికి అవి దెబ్బతినే అవకాశం ఉంది. సుమారు రూ.2 కోట్ల మేర నాబార్డు నిధులతో చేపట్టిన తరగతి గదులు, అభివృద్ధి పనుల నిర్మాణాలు నాలుగేళ్లయినా పునాదులకు పరిమితమయ్యాయి. ఈ పాఠశాలలో 25 తరగతి గదులు వున్నా సుమారు 4 కోట్ల రూపాయలతో అదనపు తరగతి గదుల నిర్మాణం అవసరం లేదని, అధికారుల అనాలోచిత నిర్ణయాలతో ప్రభుత్వ నిధులు దుర్వినియోగం అయ్యాయని స్థానికులు విమర్శిస్తున్నారు. ఈ నిధులతో మౌలిక సదుపాయాలు కల్పిస్తే ఉపయోగపడేవంటున్నారు. గదులకు మరమ్మతులు చేసి ఫర్నీచర్, ఫ్యాన్‌లు, విద్యుత్ లైట్లు అదనపు మరుగుదొడ్లు నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.



గంగమ్మ ఒడి చేర్చెదా రావయ్యా.. గణపయ్యా..

దివ్యమంగళ స్వరూపుడైన ఉమాసుతుడికి భక్తిప్రపత్తులతో ప్రజలు పూజలు చేస్తున్నారు. చవితి పర్వదినం నుంచి వివిధ రూపాల్లో కొలువు దీర్చి విఘ్నాధిపతి ఎదుట ప్రణమిల్లుతున్నారు. కరుణామయుడైన గణనాథుడి ఆశీస్సుల కోసం వేడుకుంటున్నారు. పూజానంతరం కొందరు తొలిరోజునే ఈ మహాగణేశుడి విగ్రహాలను నిమజ్జనం చేయగా మూడోరోజైన శుక్రవారం మరికొందరు వీడ్కోలు పలికారు. గుండెల నిండా భక్తి నింపుకొని, శిరస్సుపై వక్రతుండుడి ప్రతిమను పెట్టుకుని గంగమ్మ ఒడి చేర్చేందుకు ఓ మహిళ బయలుదేరిందిలా.. తిరుపతిలో శుక్రవారం సాయంసంధ్య వేళ కనిపించిన అపురూప ఆధ్యాత్మిక దృశ్యం గజాననుడి పట్ల చూపిన భక్తిభావనకు అద్దం పట్టింది.

మహిళలకు ఆర్థిక, ఆధ్యాత్మిక క్రమశిక్షణ అవసరం


మాట్లాడుతున్న డీజీఎం శర్మ

తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): మహిళలకు ఆర్థిక, ఆధ్యాత్మిక క్రమశిక్షణ అలవాటు చేయడంలో రాష్ట్రీయ సేవా సమితి చేస్తున్న కృషి అభినందనీయమని యూనియన్ బ్యాంక్ డీజీఎం శర్మ వెల్లడించారు. స్థానిక అన్నమయ్య మార్గ్‌లోని రాస్ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం సామూహిక లక్ష్మీ పూజలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన శర్మ మాట్లాడుతూ మహిళల్లో మార్పు సమాజాభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. మహిళల స్వయం ఉపాధి కోసం రాస్ చేస్తున్న కార్యక్రమాలను ఆయన అభినందించారు. రాస్ ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటరత్నం నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పి4 పథకాన్ని 30 ఏళ్ల నుంచి రాస్ చేపడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో రాస్ సంయుక్త కార్యదర్శి మమత, డైరెక్టర్ వి.నాగరాజు, మేనేజర్లు ప్రసాద్, గిరిధర్ పాల్గొన్నారు.

పద్మావతీ ఆలయాభివృద్ధిపై దృష్టి పెట్టండి

తిరుపతి(జీవకోన), ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయ అభివృద్ధిపై దృష్టి సారించాలని బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి కోరారు. తిరుమల శ్రీవారి ఆలయంపై ఉన్న మమకారం తిరుచానూరు అమ్మవారి ఆలయంపైనా చూపాలన్నారు. ఆలయంలో భక్తులకు మెరుగైన సదుపాయాలు లేకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. రద్దీ సమయంలో 30వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుంటున్నారని, సాధారణ రోజుల్లో 22వేల మందికి పైగా వస్తున్నారని, ఇందుకు తగినట్లు మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. క్యూకాంప్లెక్సు నిర్మించాలని, ప్రత్యేక పార్కింగ్ సదుపాయం కల్పించాలని కోరారు. మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాలన్నారు. అంబులెన్సులను అందుబాటులో ఉంచాలని, మంచినీటి సౌకర్యం కల్పించాలని కోరారు.


జీవకోన పరిధిలోని 47వ డివిజన్‌లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద శుక్రవారం నిర్వహించిన పూజ కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ నేత గోర్ల మధుసూదన్ నాయుడు

అన్నమయ్య కీర్తనలపై పోటీలు నిర్వహించాలి: ఈవో

తిరుమల, ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఆధ్వర్యంలో అన్ని ధార్మిక ప్రాజెక్టుల పనితీరుపై టీటీడీ ఈవో శ్యామలరావు శుక్రవారం తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో సమీక్షించారు. ఈసందర్భంగా ఈవో మాట్లాడుతూ.. అన్నమయ్య కీర్తనలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహించాలన్నారు. అందుకు ముందస్తుగా ఆడిషన్లు చేపట్టాలని సూచించారు. కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. పిల్లలకు, యువతలో అన్నమయ్య కీర్తనలపై మక్కువ పెంచేందుకు వినూత్న కార్యక్రమాలు రూపొందించాలన్నారు. ఈనెల 31న 'హరికథ వైభవం' కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. టీటీడీ ఆలయాల్లో క్రమం తప్పకుండా సాంస్కృతిక, ఆధ్యాత్మిక, భక్తి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో శ్రీనివాస కల్యాణాలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. సమీక్షలో జేఈవో వీరబ్రహ్మం, ఇతర ప్రాజెక్టుల అధికారులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కోలా ఆనంద్ ప్రమాణ స్వీకారం


మాధవ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కోలా ఆనంద్

శ్రీకాళహస్తి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): విజయవాడలోని బీజేపీ కార్యాలయంలో రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కోలా ఆనంద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. జాతీయ ప్రధాన కార్యదర్శి శివప్రకాష్, రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్, రాష్ట్ర సంఘటన మంత్రి మధుకర్ సమక్షంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు అవకాశం కల్పించిన కేంద్ర పెద్దలకు, రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ పాల్గొన్నారు.

రామ్మోహన్‌కు ఎస్ఈగా పదోన్నతి



తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 29(ఆంధ్ర జ్యోతి): జిల్లా పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న ఎం.రామ్మోహన్‌కు ఎస్ఈగా పదోన్నతి కల్పించారు. ఆయన్ను ఏపీసీ ఆర్‌డీఏకు బదిలీ చేస్తూ పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. అన్నమయ్య జిల్లా పీలేరులో డీఈగా పనిచేస్తున్న మధుసూదన్‌ను జిల్లా ఇన్‌చార్జి పీఆర్ ఈఈగా బదిలీ చేశారు. రామ్మోహన్ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ ఏడాది కాలం జిల్లాలో ఈఈగా పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు.

ఎస్వీ మెడికల్ కాలేజీ అసోసియేట్ ప్రొఫెసర్లకు పదోన్నతి

తిరుపతి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఎస్వీ ప్రభుత్వ మెడికల్ కళాశాల ఆప్తాల్మజీ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న ఇద్దరికి ప్రభుత్వం పదోన్నతి కల్పించింది. డాక్టర్ వై.శ్రీనివాస్ ప్రొఫెసర్‌గా పదోన్నతిపై ఒంగోలు ప్రభుత్వ మెడికల్ కాలేజీకి బదిలీ కాగా, డాక్టర్ పీఏఎస్ చలపతి రెడ్డి తిరుపతి ఎస్వీ మెడికల్ కాలేజీలోనే ప్రొఫెసర్ పోస్టులో నియమితులయ్యారు.

ఈ మేరకు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

కాంగ్రెస్ శ్రేణుల ధర్నా

గూడూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక టవర్‌క్లాక్ వద్ద శుక్రవారం కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శి పంటా శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ఎలక్షన్ కమిషన్‌ను తన అధికార బలంతో ఉపయోగించుకుని కీలుబొమ్మలా మార్చివేసిందన్నారు. ఒకే చిరునామాతో వందల కొద్దీ ఓటర్లు ఉండడం, ఒకే వ్యక్తికి మూడు, నాలుగు రాష్ట్రాల్లో ఓటు ఉండడం వంటి అనేక పొరపాట్లు చోటు చేసుకున్నా పట్టించుకోలేదన్నారు.

తెలుగు వెలుగులతో తెలుగు నేల వర్ధిల్లాలి



విద్యార్థులతో ఉమేష్‌రావు తదితరులు, ఏర్పేడు పాఠశాలలో తెలుగు కవుల వేషధారణలో ఆకట్టుకున్న విద్యార్థులు

శ్రీకాళహస్తి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): తెలుగు వెలు గులతో తెలుగు నేల వర్ధిల్లాలని టీడీపీ రాష్ట్ర బీసీ విభా గం కార్యనిర్వాహక కార్యదర్శి ఉమేష్‌రావు అన్నారు. పట్టణంలోని ఎన్టీఆర్‌నగర్‌లో గల పురపాలక సంఘ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో తెలుగు భాష దినోత్సవాన్ని విద్యార్థుల మధ్య ఘనంగా నిర్వహించారు. తెలుగు భాషాభివృద్ధికి ఉపయోగపడే గ్రంథాలను వారికి ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ గిడుగు వెంకట రామమూర్తి ఉద్యమ ఫలితంగా వాడుక బాషలోనే రచనలు చేసుకుని నేడు మనమంతా చదువుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దశరథాచారి, వన్నెకుల క్షత్రియ సంక్షేమ సంఘం కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల రవి, తంగేళ్లపాళెం సింగిల్ విండో చైర్మన్ భీమాల భాస్కర్ ముదిరాజ్, నాయకులు వజ్రం కిషోర్, సయ్యద్ చాంద్‌బాషా, కోట చంద్రశేఖర్, మురళీనాయుడు, మణి, సంజాకుల మురళీ కృష్ణ, భగత్, కృష్ణమూర్తి, మహ్మద్, భాస్కర్, హెచ్‌ఎం సురేష్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంజీఎం పాఠశాలలో..

ఎంజీఎం పాఠశాలలో విద్యార్థులు తెలుగు సంప్ర దాయ దుస్తుల్లో హాజర య్యారు. డైరెక్టర్ గుడ్లూరు మయూర్ మాట్లాడుతూ తెలుగు భాష విశిష్టత ను వివరించారు. అలాగే క్రీడల దినోత్సం నిర్వహించారు. హెచ్‌ఎం మునిరత్నం నాయుడు ● ముచ్చివోలు జడ్పీ ఉన్నత పాఠశాల లోనూ తెలుగు భాష దినోత్సవాన్ని నిర్వహించారు. **ఏర్పేడు:** ఏర్పేడు జడ్పీ ఉన్నత పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. హెచ్‌ఎం మునికుమారి అధ్యక్షులుగా వ్యవహరించారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. భానుప్రకాష్, వ్యాయామ ఉపాధ్యాయులు మణి, తెలుగు ఉపాధ్యాయులు మధు, హరిప్రసాద్, శైలజ, గోపి పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సత్యనారాయణరాజు తదితరులు

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి) : భారతీయ విద్యాభవన్‌లో గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని శుక్రవారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. విద్యాభవన్ డైరెక్టర్ నడింపల్లి సత్యనారాయణ రాజు మాట్లాడుతూ గిడుగు రామ్మూర్తి తెలుగు భాషకు ఎనలేని సేవ చేశారని తెలిపారు. విద్యార్థులు రామాయణ, భాగవత, బాలగేయాలు, శతక పద్యాలతో అలరించారు. హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జయంతి వేడుకలు కూడా నిర్వహించారు. కార్యక్రమంలో భారతీయ విద్యాభవన్ ప్రిన్సిపాల్ డి.పద్మజ, వైస్ ప్రిన్సిపాల్, టీచర్లు పాల్గొన్నారు.

జోరుగా అభివృద్ధి పనులు



ఫ్లోరింగ్ పనులు చేస్తున్న కార్మికులు

తిరుపతి అర్బన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ముందు అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి. కార్యాలయ ప్రాంగణంలో నేల ఎగుడు దిగుడుగా ఉండడంతో అక్కడికి వచ్చే ప్రజలకు, వాహనాల పార్కింగ్‌కు ఇబ్బందులు ఎదురయ్యేవి. ఈ క్రమంలో నేలను చదునుచేసి సిమెంట్ రాళ్లు పరుస్తున్నారు. అక్కడున్న దిరిసెనచెట్టు కూలిపోయే పరిస్థితుల్లో ఉండడాన్ని గుర్తించి పూర్తిగా తొలగించారు. ఇప్పటివరకు మూసివేసి ఉన్న విజిటర్స్ వెయిటింగ్ హాలును ఓపెన్ చేసి, ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు.

క్రీడా ప్రతిభ అవార్డుల ప్రదానం



విద్యార్థులకు అవార్డులు ప్రదానం చేస్తున్న ఇన్‌చార్జ్ హెచ్‌ఎం మురళి

తిరుపతి(క్రీడలు), ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని మంగళం ట్రెండ్స్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు క్రీడా ప్రతిభ అవార్డులు ప్రదానం చేశారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా గత ఏడాది వివిధ క్రీడల్లో రాణించిన 25 ఉన్నత పాఠశాలల వివరాలను పంపారు. 258 పాయింట్లతో ప్రథమ స్థానంలో నిలిచిన మంగళం ట్రెండ్స్ ఉన్నత పాఠశాలకు స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డును ప్రకటించారు. శుక్రవారం ఉదయం పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం మురళి ఆధ్వర్యంలో క్రీడాకారులకు అవార్డులు, సర్టిఫికెట్స్ అందజేశారు. జాతీయ, రాష్ట్ర స్థాయిలో జూడో, బేస్‌బాల్, సాఫ్ట్‌బాల్ క్రీడల్లో ప్రతిభ చాటిన భావన(9వ తరగతి)కు ఉపాధ్యాయులు గౌరీశంకర్‌రావు, రామచంద్రయ్య, సాంబశివరావు, వసుంధర రూ.2,500 నగదు బహుమతి అందించారు. అనంతరం తెలుగుభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎస్ఎస్‌ఏ గౌరీశంకర్‌రావు, సీఎంవో సురేష్, డీఏ ఎస్డీవో శశిధర్, రూపలత, పీడీలు రామకృష్ణ, సాంబశివరావు, శ్రీధర్, చంద్రశేఖర్, రమణయ్య, సుభాష్‌చంద్రదాస్, సుబ్రహ్మణ్యం, వరలక్ష్మి, జీవరత్న, హిమబిందు, శారద, శైలజరాణి, మాధవి, వాసవి పాల్గొన్నారు.

తెలుగు మాధ్యమాన్ని పునరుద్ధరించాలి

భాషోపాధ్యాయుల వినూత్న నిరసన



తెలుగుతల్లి విగ్రహానికి విన్నవిస్తున్న ఉమామహేశ్వర్

తిరుపతి(గాంధీరోడ్డు), ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు మాధ్యమాన్ని పునరుద్ధరించాలని భాషోపాధ్యాయ సంస్థ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు దొడ్డ ఉమామహేశ్వర్ కోరారు. సంఘ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని తెలుగుతల్లి విగ్రహానికి వినతిపత్రం సమర్పించి, నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీలో భాగంగా కూటమి ప్రభుత్వం తెలుగు మాధ్యమాన్ని పునరుద్ధరించి, ప్రాథమికోన్నత పాఠశాలలో తెలుగు టీచర్లను నియమించాలన్నారు. భాషోపాధ్యాయులను క్లస్టర్, పీఎస్‌హెచ్‌ఎం పోస్టుల నుంచి తప్పించి భాషోపాధ్యాయ విధుల్లోనే నియమించాలని కోరారు. డీఈవో పూల్ భాషా పండితులకు హైకోర్టు తీర్పును అమలు చేసి పదోన్నతులు కల్పించాలని విన్నవించారు. రాష్ట్ర కార్యదర్శి పట్టాభిరామయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి సిబ్బాల కిరణ్‌కుమార్, గౌరవ సలహాదారు సి.ఈశ్వరయ్య, నాయకులు వాసుదేవయ్య, గురుస్వామి, రాఘవేంద్ర, టీచర్లు పాల్గొన్నారు.

అందమైన భాష తెలుగు

ఎంజీఎంలో ఘనంగా తెలుగు భాష, జాతీయ క్రీడా దినోత్సవాలు



వక్తృత్వ పోటీల విజేతలకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందిస్తున్న హెచ్‌ఎం మధుసూదన్

తిరుపతి(విద్య), ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): భాషలన్నింటిలోకి అందమైంది తెలుగు అని బైరాగిపట్టెలోని మహాత్మా గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల (ఎంజీఎం) ఇన్‌చార్జి హెచ్‌ఎం బండి మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. తెలుగు భాషా, జాతీయ క్రీడా దినోత్సవాలను పాఠశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మాతృభాషపై పట్టు సాధించాలని, తద్వారా ప్రపంచ భాషలను నేర్చుకోవడం, అధ్యయనం చేయడం సాధ్యమవుతుందని అన్నారు. ఉపాధ్యాయులు మారుతీదేవి, కుమార్, అరుణ తెలుగు భాష ప్రాముఖ్యత గురించి తెలియజేశారు. వక్తృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కాగా, విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని, క్రీడల ద్వారా మానసిక వికాసం వస్తుందని వివరించారు. వ్యాయామ ఉపాధ్యాయని విజయకుమారి మాట్లాడారు.

జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో...



క్రీడాకారులకు సర్టిఫికెట్స్ అందజేసిన ప్రొఫెసర్లు

తిరుపతి(క్రీడలు), ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో ధ్యాన్‌చంద్ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వీసీ కృష్ణమూర్తి, రిజిస్ట్రార్ నారాయణరావు, అకడమిక్ డీన్ రజనీకాంత్‌శుక్లా, ఇతర డీన్లు, విద్యార్థులు హాకీ దిగ్గజం ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళి అర్పించారు. క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు.

నేడు, రేపు మహతిలో శృతిలయలు

తిరుపతి(ఎమ్మార్‌పల్లె), ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఫిలిం సొసైటీ, టీటీడీ సహకారంతో శని, ఆదివారాల్లో మహతి ఆడిటోరియంలో శృతిలయలు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సొసైటీ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ సినిమా రంగంలో సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీట వేసిన దర్శకులు బాపు, విశ్వనాథ్‌లను తలచుకుంటూ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అధ్యక్షుడు వైఎస్ బాబు మాట్లాడుతూ టీవీ నటి ప్రియాంకజైన్, నటుడు శివకుమార్ పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి శేషగిరి రావు, కోశాధికారి ప్రసాద్‌రావు, బుజ్జిబాబునాయుడు, శాంతవాణి, శంకర్, అనసూయ పాల్గొన్నారు.

తెలుగు భాష పరిరక్షణ అందరి బాధ్యత

ఎస్వీయూ తెలుగు విభాగాధిపతి ఆచార్య రాజేశ్వరమ్మ



కార్యక్రమంలో పాల్గొన్న ప్రొఫెసర్ రాజేశ్వరమ్మ తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషను పరిరక్షించుకోవడం అందరి బాధ్యత అని ఎస్వీయూ తెలుగు విభాగాధిపతి ఆచార్య రాజేశ్వరమ్మ పేర్కొన్నారు. తెలుగు విభాగంలో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. రాజేశ్వరమ్మ మాట్లాడుతూ అధికారిక భాషలో పీహెచ్‌డీ గ్రంథాన్ని సమర్పించే అవకాశాన్ని ఎస్వీయూ తెలుగు విభాగమే తొలిసారి కల్పించిందన్నారు. విశ్రాంతాచార్యులు కాటూరి శారద, పేట శ్రీనివాసులు రెడ్డి, శివుని రాజేశ్వరి మాట్లాడుతూ ప్రపంచంలోనే తెలుగు భాషకు ఎంతో గొప్ప గుర్తింపు ఉందన్నారు. వ్యాస రచన పోటీల్లో విజేతలుగా నిలిచిన పీజీ విద్యార్థులు కొండమీదపల్లె కృతి, వెంకటేశ్వర్లు, దువ్వూరి చందనకు పుస్తక బహుమతులు అందజేసి అభినందించారు.

తెలుగు భాష కోసం జీవితాన్ని త్యాగం చేసిన గిడుగు

తెలుగు భాష కోసం గిడుగు రామ్మూర్తి పంతులు తన జీవితాన్ని త్యాగం చేశారని పద్మావతి యూనివర్సిటీ తెలుగు అధ్యాపకులు డాక్టర్ సుభాషిణి, డాక్టర్ యువశ్రీ పాల్గొన్నారు. తెలుగు విభాగంలో శుక్రవారం గిడుగు జయంతి సందర్భంగా చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

తల్లి భాషను మరవరాదు

తల్లి భాషను మరవరాదని పద్మావతి డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ నారాయణమ్మ, తెలుగు విభాగాధిపతి కృష్ణవేణి, సాహిత్యవేత్త పోతన్న కోరారు. పద్మావతి కాలేజీలో శుక్రవారం నిర్వహించిన తెలుగు భాషా దినోత్సవంలో వారు పాల్గొని మాట్లాడారు.

ఘనంగా గిడుగు జయంతి



సమావేశంలో మాట్లాడుతున్న గరికపాటి రమేష్‌బాబు

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : బైరాగిపట్టెడలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో శుక్రవారం తిరుపతి జిల్లా రచయితల సంఘం, ఈతరం కవితా వేదిక ఆధ్వర్యంలో గిడుగు రామ్మూర్తి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గిడుగు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తిరుపతి జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు సాకం నాగరాజు, పరిశోధక విద్యార్థి గరికపాటి రమేష్‌బాబు తెలుగుభాష అభివృద్ధికి గిడుగు రామ్మూర్తి చేసిన కృషి వివరించారు. ఈతరం కవిత వేదిక అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు, ఆకాశవాణి విశ్రాంత సంచాలకులు ఆకుల మల్లేశ్వర రావు, నెమిలేటి కిట్టన్న, రెడ్డిపల్లి షాజహాన్, వాకా ప్రసాద్, పేరూరు బాలసుబ్రమణ్యం ఆర్సీ కృష్ణస్వామిరాజు, చంద్రశేఖర్ నాయుడు, వెంకట రమణప్రసాద్, కాంతారావు, ఓబుల్‌రెడ్డి, ఆకుతోట గజేంద్ర, శ్రీనివాసరావు, విశ్వనాథరెడ్డి, ఓవీ రమణ పాల్గొన్నారు. కాగా, తిరుపతిలోని గేట్ కాలేజీలో తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఎస్వీయూ కల్చరల్ కోఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్‌చౌదరి, గేట్ కాలేజీ అధినేత వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టండి



చిరువ్యాపారులతో మాట్లాడుతున్న కమిషనర్ మౌర్య

తిరుపతి, ఆగస్టు29(ఆంధ్రజ్యోతి) : అలిపిరి, రుయా పరిసర ప్రాంతాల్లో వాహన చోదకులకు, భక్తులకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా తగు చర్యలు చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదుల మేరకు శుక్రవారం రుయాస్పత్రి నుంచి అలిపిరి, జూపార్కు మార్గంలో ఫుట్‌పాత్, రోడ్లపైన ఉన్న తోపుడు బండ్లు, ఇతర వ్యాపారాలను ఆమె పరిశీలించారు. అలిపిరి వద్ద తోపుడు బండ్లు, టిఫిన్ షాపులు, పసుపు, కుంకుమ అమ్మేవారు ఫుట్‌పాత్‌లు, రోడ్లపై వ్యాపారాలు చేయడం వల్ల పాదచారులు, వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయని అన్నారు. అధికారులు, ట్రాఫిక్ పోలీసులు సమన్వయం చేసుకుని సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. కమిషనర్ వెంట డీఈ మధు, శానిటరీ సూపర్‌వైజర్ చెంచయ్య ఉన్నారు.

తెలుగు భాషకు ప్రాణం పోసిన గిడుగు



గిడుగు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సదాశివం, హనుమంతరావు

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి) : తెలుగు భాషను వ్యవహారిక భాషగా ప్రజలకు అందించిన భాషా ఉద్యమకారుడు గిడుగు వెంకట రామ్మూర్తి అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, టీడీపీ బ్రాహ్మణ సాధికార సమితి రాష్ట్ర సభ్యుడు చిత్రపు హనుమంతరావు అన్నారు. రాములవారి గుడి దక్షిణమాడ వీధిలోని చిగోరా ఆధ్యాత్మిక సేవా కేంద్రంలో గిడుగు రామ్మూర్తి జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గిడుగు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

డాక్టరేట్ ప్రదానం



మోహన్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): సంస్కృత వర్సిటీ ఆగమ విభాగ పరిశోధకుడు కె. మోహన్ డాక్టరేట్ పొందారు. భృగుప్రోక్తస్య యజ్ఞాధికారస్య వైఖానస గ్రంథాన్నరై: సహ తులనాత్మక అధ్యయనం అంశంపై ప్రొఫెసర్ వేదాంతం విష్ణుభట్టాచార్యుల పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. ఆవడిలో గల కంచి పాఠశాలలో ఆగమ ఉపాధ్యాయులుగా ఉన్నారు.

పార్టీని బలోపేతం చేయండి



జనసేనానిని కలసిన రాజారెడ్డి

తిరుపతి అర్బన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): తిరపతిలో జనసేన పార్టీని మరింత బలోపేతం చేయాలని ఆ పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నగరాధ్యక్షుడు రాజారెడ్డిని కోరారు. విశాఖపట్నంలో జరుగుతున్న సేనతో సేనాని కార్యక్రమానికి రాజారెడ్డి హాజరయ్యారు. శుక్రవారం పవన్‌ను మర్యాదపూర్వకంగా కలసి శ్రీవారి ప్రసాదాలు అందజేశారు. నగరంలో పార్టీ కేడర్ పనితీరుపై ఆరాతీశారు. అందరూ సమన్వయంతో పార్టీని ముందుకు తీసుకెళ్లాలని జనసేనాని ఆదేశించారు.

ఎస్వీ వేద విశ్వవిద్యాలయంలో ఘనంగా క్రీడా దినోత్సవం



వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

తిరుపతి (క్రీడలు), ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ వేద విశ్వవిద్యాలయంలో శుక్రవారం జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య రాణి సదాశివమూర్తి, క్రీడాభారతి జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరప్రసాద్ హాజరయ్యారు. విద్యార్థులకు వాలీబాల్, కబడ్డీ, చదరంగం పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మశ్రీ గోళి సుబ్రహ్మణ్యంశర్మ, ఉమేష్ పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం తిరుచానూరు అధ్యక్షుడిగా మోతిరాజ్



మోతిరాజ్‌కు ఉత్తర్వుల పత్రం అందజేస్తున్న నాగరాజుగౌడ్

తిరుపతి అర్బన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ సంఘం తిరుచానూరు పంచాయతీ అధ్యక్షుడిగా ఎ.మోతిరాజ్ నియమితులయ్యారు. స్థానిక పెద్దకాపు లేఅవుట్‌లోని హోటల్లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఏపీ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజుగౌడ్ ఉత్తర్వులు అందజేశారు. మోతిరాజ్‌ను పలువురు అభినందించారు.

మధురానగర్‌లో కంపు..కంపు

● మూడు రోజులుగా ఆగిన ఇంటింటా చెత్త సేకరణ



తిరుపతి(మధురానగర్), ఆగస్టు 29 (ఆంధ్ర జ్యోతి): నగర నడిబొడ్డున ఉన్న మధురానగర్‌లో ఇంటింటి చెత్త సేకరణ మూడు రోజులుగా ఆగి పోయింది. ఇళ్లలో, పరిసరాల్లో చెత్త పేరుకుపోయి కంపు కొడుతోంది. ఈ ప్రాంతంలో చెత్త సేకరించే సావిత్రమ్మకు జ్వరం కారణంగా సెలవు పెట్టింది. దీంతో మధురానగర్‌లోని మూడు వీధులు, వినాయక మండపాల వద్ద కుప్పలు, కుప్పలుగా చెత్త పేరుకుపోయింది. మరో వైపు చేపల మార్కెట్ వద్ద డ్రైనేజీలను శుభ్రం చేయకపోవడంతో ముక్కులు పగిలిపోయే దుర్గంధం వెదజల్లుతోంది. కుక్కలు ఇష్టానుసారం ఆ చెత్తను రోడ్లపైకి లాగి పడేస్తున్నాయి. ఒక కార్మికురాలు సెలవులో ఉంటే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సిన మేస్త్రీ పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఈ విషయమై కమిషనర్ మౌర్యకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆ ప్రాంత మహిళలు ఆరోపిస్తున్నారు.

వసతిగృహంలో చోరీ యత్నంపై ప్రిన్సిపాల్ ఆరా

తిరుపతి(వైద్యం), ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఎస్వీ వైద్య కళాశాల ఆవరణలోని వైద్య విద్యార్థుల వసతిగృహంలో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి చొరబడి చోరీకి ప్రయత్నించిన విషయంపై శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ రవిప్రభ ఆరా తీశారు. వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, వసతిగృహ వార్డెన్ చండీప్రియ, సెక్యూరిటీ మేనేజరు శంకర్‌లతో సమీక్షించారు. మరోసారి ఇటువంటి ఘటన జరగకుండా గట్టి భద్రతా చర్యలు చేపట్టాలని, అలాగే సెక్యూరిటీ సిబ్బందిని పెంచాలని ఆదేశించారు.

మహిళా వర్సిటీలో క్రీడా దినోత్సవం

తిరుపతి(క్రీడలు),ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో శుక్రవారం జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా వర్సిటీ ఉపకులపతి వి.ఉమ, రిజిస్ట్రార్ ఎన్.రజని పాల్గొని మేజర్ ధ్యానచంద్ చిత్రపటానికి పూలమాలలువేసి పుష్పాంజలి ఘటించారు. ఆయన దేశానికి అందించిన సేవలను, కృషిని కొనియాడారు. డీన్స్ వాణి, సుధా, వ్యాయామ విద్యావిభాగాధిపతి సరోజిని పాల్గొన్నారు.



వినాయక చవితి వేడుకల్లో భాగంగా శుక్రవారం జీవకోన క్రాంతినగర్‌లోని మహాగణపతి ఆలయం వద్ద అన్నదానం చేస్తున్న బాలకృష్ణ, మోహన్‌లాల్









మూడవ రోజు నిమజ్జన వేడుకలు

తిరుపతి(జీవకోన), ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): వినాయకచవితి పండుగను పురస్కరించుకుని మూడవ రోజు శుక్రవారం స్థానిక వినాయకసాగర్‌లో చిన్నపాటి విగ్రహాలను నిమజ్జనం చేశారు. సాయంత్రం ఐదు గంటల నుంచి నగర పరిధిలోని వీధుల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను సాగర్‌కు తీసుకువచ్చి భక్తి శ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించి నిమజ్జనం చేశారు. జై గణేశా.. జైజై గణేశా అంటూ యువత ఆనందోత్సాహాలతో జేజేలు కొట్టారు. ఆదివారం ఐదవ రజు పెద్దయెత్తున నిమజ్జన కార్యక్రమం జరగనుంది. ఇందుకు సంబంధించి మున్సిపల్ కార్పొరేషన్‌తోపాటు వివిధ శాఖల అధికారులు, పోలీసు శాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. అలిపిరి ఎస్ఐ నాగార్జునరెడ్డి, సిబ్బంది సాగర్ వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా బందోబస్తు నిర్వహించారు.



తిరుమలేశుడి సేవలో ఐశ్వర్యా రాజేష్


సినీ హీరోయిన్ ఐశ్వర్యా రాజేష్ శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో కుటుంబ సమేతంగా ఆలయంలోకి వెళ్లి మూలమూర్తిని దర్శించుకున్నారు. రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి లడ్డూప్రసాదాలు అందజేశారు. ఆలయం వెలుపల ఆమెను పలువురు సినీ అభిమానులు ఆసక్తిగా చూశారు. కొందరు సెల్ఫీలు దిగారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

మే 15 కటాఫ్‌తో డీఎస్సీ అర్హత నిర్ణయించడం సరికాదు : ఆపస్

తిరుపతి(విద్య), ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ అభ్యర్థుల విద్యార్హత సర్టిఫికెట్లు మే 15 తర్వాత జారీ అయ్యాయనే కారణంతో వారిని అనర్హులుగా నిర్ణయించడం ఎంతమాత్రమూ సరికాదని ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు శవన్నగారి బాలాజీ, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ పేర్కొన్నారు. ప్రభుత్వ డీఎస్సీ ప్రకటన ప్రకారం మే 15వ తేదీకి ముందే పరీక్షలు రాసి, ఫలితాలు వెల్లడైన విద్యార్థులే దరఖాస్తు చేసుకున్నారని, అయితే వారికి మే 15 తరువాత సర్టిఫికెట్లు జారీ అయ్యాయని వివరించారు. ప్రభుత్వం స్పందించి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నాటికి అర్హత కలిగిన వారందరికీ పోస్టింగులు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చాలామంది అభ్యర్థులకు కాల్ లెటర్స్ అందలేదని, అందువల్ల ఎవరు ఏరోజున వెరిఫికేషన్‌కు రావాలో తెలియడం లేదని పేర్కొన్నారు. పోస్టింగులు ఇవ్వడానికి ముందే ప్రతి జిల్లాలో సబ్జెక్టు వారీగా రోస్టర్ కమ్ మెరిట్‌లో అభ్యర్థులకు సంబంధించిన మార్కులు రిజర్వేషన్ కేటగిరీ తెలిసేలా ఫైనల్ సెలెక్షన్ లిస్టులు ప్రకటించాలని కోరారు. అభ్యర్థుల అనుమానాలను నివృత్తి చేయడానికి హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

శ్రీవారి సర్వదర్శనానికి 8 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లో 12 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.3.49 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 63,843

తలనీలాలు సమర్పించినవారు: 21,344

మరింత సమర్థంగా వ్యర్థాల నిర్వహణ

ఆదేశించిన టీటీడీ ఈవో శ్యామలరావు

తిరుమల, ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఘన వ్యర్థాల నిర్వహణపై టీటీడీ ఈవో శ్యామలరావు అధికారులతో సమీక్షించారు. అన్నమయ్య భవనంలో అదనపు ఈవో వెంకయ్య చౌదరి, ఇతర అధికారులతో కలిసి ఈఅంశంపై చర్చించారు. ఈసందర్భంగా ఈవో మాట్లాడుతూ.. తిరుమలలోని తడి చెత్త ద్వారా బయోగ్యాస్, ఎరువులు తయారీకి టీటీడీ-ఐఓసీఎల్ భాగస్వామ్యంతో బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు చేసినట్టు వివరించారు. విభజన అవసరం లేకుండా వ్యర్థాల నిర్వహణ సమర్థ అమలుకు పద్ధతులను అన్వేషించాలని ఆదేశించారు. సమావేశంలో పాల్గొన్న ప్రముఖ శాస్త్రవేత్త, పద్మశ్రీ గ్రహీత శరద్ ఖలే, బయోడిగ్రేడబుల్ వ్యర్థాలను ఉపయోగించి బయోగ్యాస్ ఉత్పత్తి చేయడం పర్యావరణ అనుకూల పరిష్కారమని పేర్కొన్నారు. త్వరలో టీటీడీకి అనువైన ప్రణాళికను అందజేస్తానన్నారు. కూరగాయల వ్యర్థాలతో సేంద్రీయ ఎరువుల తయారీ విధానాన్ని ప్రదర్శించారు. సమీక్షలో టీటీడీ సీఈ సత్యనారాయణ, ఈఈ సుధాకర్, డిప్యూటీఈవో సోమన్నారాయణ, హెల్త్ ఆఫీసర్ మధుసూదన్, శాస్త్రవేత్తలు సందీప్ అసోలేకర్, బౌ నిపర్తే తదితరులు పాల్గొన్నారు.



కూరగాయల వ్యర్థాలతో సేంద్రీయ ఎరువుల తయారీ ప్రక్రియను ప్రదర్శిస్తున్న శరద్ ఖలే

గంగమ్మ ఒడిలోకి గణనాథుడు

తూపిలిపాళెం తీరంలో భారీ ఏర్పాట్ల మధ్య నిమజ్జనోత్సవం

వాకాడు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): భక్తుల తన్మయత్వం, యువత ఉత్సాహం, చిన్నారుల కేరింతల మధ్య శుక్రవారం వాకాడు మండలం తూపిలిపాళెం సముద్రతీరంలో గణేష్ నిమజ్జనోత్సవం జరిగింది. నెల్లూరు, తిరుపతి జిల్లాల నుంచి ట్రాక్టర్లు, మినీట్రక్కులు, ట్రాలీ ఆటోలు, లారీల ద్వారా వినాయక విగ్రహాలను తీసుకొచ్చి నిమజ్జనం చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విద్యుత్ దీపాలు, ఒక భారీ క్రేన్, బోట్లను, గజఈతగాళ్లను అధికారులు ఏర్పాటు చేశారు. గంగన్నపాళెం సర్పంచి మారంరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి ఏర్పాట్లు పరిశీలించారు. 115 మందితో బందోబస్తు చేపట్టినట్లు సీఐ హుస్సేన్‌బాబు తెలిపారు. లైట్‌హౌస్, తూపిలిపాళెం సముద్రతీరాలలో 224 గణపతి ప్రతిమలతో భక్తులు నిమజ్జనం చేశారు. వాకాడు, కోట చిట్టమూరు ఎస్‌ఐలు నాగబాబు, పవన్, బలరామయ్య, డీటీ రఫీ సయ్యద్, ఆర్‌ఐ అఖిల్ తదితరులున్నారు.



ఎస్వీయూ ఎల్‌ఎల్‌బీ పరీక్ష వాయిదా

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ పరిధిలో ఎల్‌ఎల్‌బీ ఐదేళ్ల కోర్సు నాల్గవ సెమిస్టర్ పరీక్ష ఒకటి వాయిదా పడింది. సెప్టెంబరు 5వ తేదీన ఎన్విరాన్‌మెంటల్ లా (వైల్డ్ లైఫ్ ప్రొటెక్షన్ యాక్ట్) పరీక్ష నిర్వహించాలని భావించారు. అయితే అదే రోజున మిలద్-ఉన్-నబీ పండుగ కారణంగా పబ్లిక్ హాలిడే ఉంది. ఇందువల్ల ఆ పరీక్షను సెప్టెంబరు 8వ తేదీ నాటికి వాయిదా వేశారు. ఈ మేరకు లా కాలేజీలు, పరీక్షా కేంద్రాలకు యూనివర్సిటీ పరీక్షల విభాగం అధికారిక ఉత్తర్వులు పంపిందని వర్సిటీ పరీక్షల అధికారి రాజమాణిక్యం తెలిపారు.

జర్నలిస్టు అక్రిడిటేషన్ గడువు పొడిగింపు

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువు ముగుస్తున్న నేపథ్యంలో మరో మూడు నెలలు అంటే నవంబరు 30వ తేదీ వరకు లేదా కొత్త కార్డులు జారీ ప్రక్రియ పూర్తయ్యే వరకు పొడిగిస్తూ సమాచార, పౌర సంబంధాల శాఖ సంచాలకులు హిమాన్షు శుక్ల శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు.ఆగస్టు 31నాటికి అక్రిడిటేషన్ కార్డులు కలిగి ఉన్న పాత్రికేయులకు మాత్రమే ఇది వర్తిస్తుందని పేర్కొన్నారు. సంబంధిత మీడియా సంస్థల యాజమాన్యాలు వారివారి సంస్థలో పనిచేస్తున్న జర్నలిస్టుల వివరాలు జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో వీలైనంత త్వరగా అందజేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు.

మత సామరస్యానికి ప్రతీక వేనాడు దర్గా



● నేడు 30వ గంథోత్సవం.. ఏర్పాట్లు పూర్తి

సూళ్లూరుపేట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మండలం వేనాడులో 144 అడుగుల పొడవుతో ఉన్న దర్గా ఆసియాలోనే అతిపెద్దది. ఇక్కడి హజరత్ షేక్ దావూద్ షా వలీ అల్లా తాత దర్గా 30వ గంథోత్సవాన్ని శనివారం నిర్వహించనున్నారు. మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన ఈ దర్గా గంథోత్సవానికి హిందూ, ముస్లింలు అధిక సంఖ్యలో దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారు. గంథోత్సవానికి మన రాష్ట్రం నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వస్తారు. ఈ దర్గాలో జెండా స్థాపన నుంచి గంథోత్సవం రోజు గంధాన్ని లేపనం చేసే వరకు హిందూ మతానికి చెందిన గ్రామ పెద్దలే చేస్తారు. ముస్లిం మత పెద్దలచే బాబా సంకీర్తనలు ఉంటాయి. ఈ గంథోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వాహకులు రూ.50 లక్షలతో అభివృద్ధి పనులు చేశారు. దర్గా సమాధి చుట్టూ రేకులు షెడ్ తొలిగించి చుట్టూ సిమెంట్ గోడల నిర్మాణం చేపట్టారు. రెండు వైపులా భక్తులు గంథోత్సవాన్ని తిలకించేందుకు పెద్ద కిటికీలు ఏర్పాటు చేశారు. పైనా స్లాబ్‌వేసి వేశారు. దర్గా ప్రాంగణమంతా టైల్స్ వేశారు. జెండా స్థాపన వద్ద ప్రహరీ స్టీల్ గ్రిల్స్ ఏర్పాటు చేశారు. గంథోత్సవం సందర్భంగా దర్గా నుంచి గ్రామ పొలిమేర్ల వరకు విద్యుత్ దీపాలంకరణ చేపట్టారు. ఇక షార్ సర్కిల్, రైల్వే స్టేషన్ నుంచి వేనాడు దర్గా వరకు ఆర్టీసీ పది బస్సులను ప్రత్యేకంగా నడుపనుంది.

ఐఐటీలో ఎంటెక్ ప్రోగ్రామ్ ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం

ఏర్పేడు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఐఐటీలో ఓ కొత్త అధ్యాయం మొదలయింది. దశాబ్దకాల ప్రస్థానంలో విశేష స్థానానికి చేరుకున్న ఈ ఉన్నత విద్యాసంస్థలో ఓ కొత్త కోర్సు ప్రారంభమైంది. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని రూపొందించిన ఎంటెక్ కోర్స్(అడ్వాన్స్‌డ్ ఎనర్జీ స్టోరేజ్ టెక్నాలజీ) శుక్రవారం శ్రీకారం చుట్టుకుంది. పరిశ్రమల మద్దతుతో ఈ కోర్స్ నిర్వహించనున్నట్లు ఐఐటీ వర్గాలు తెలిపాయి. కోర్స్ ప్రారంభ కార్యక్రమంలో అధికారులతో పాటు వివిధ పరిశ్రమలకు చెందిన ప్రతినిధులు పాలుపంచుకున్నారు. రెండు రోజుల పాటు జరిగే ఓరియంటేషన్ కార్యక్రమానికి డీన్ అరుణ్‌కుమార్ అధ్వర్యం వహిస్తున్నారు. ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ మాట్లాడుతూ కొత్త బ్యాచ్ విద్యార్థులకు తమ విద్యాసంస్థ లక్ష్యం, విలువలు, సాధించిన విజయాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జేఎస్ డబ్ల్యూ గ్రూప్ ఆపరేషన్స్ అధినేత అశ్విన్ బజాజ్, అమరరాజ ఎనర్జీ అండ్ మొబిలిటీ లిమిటెడ్ సీఈవో విజయానంద్, జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ యశోధన్ ప్రమోద్ గోఖలే తదితరులు పాల్గొని ప్రసంగించారు. 13మంది ఈ ఎంటెక్ ప్రోగ్రామ్‌లో చేరారు. ఇందులో అమరాజా, జేఎస్‌డబ్ల్యూ వంటి పరిశ్రమల నుంచి స్పాన్సర్‌షిప్ పొందిన 12మంది ఉద్యోగులు ఉన్నారు. డీన్ శశిధర్ గుమ్మ తొలిరోజు కార్యక్రమాన్ని ప్రారంభించగా డాక్టర్ సౌరవ్‌చక్రవర్తి ప్రసంగంతో ఓరియంటేషన్ ముగిసింది.



ఐఐటీ సమావేశానికి హాజరైన ప్రముఖులు

మా స్మార్ట్ రేషన్ కార్డు ఎక్కడుంది?

- సచివాలయాల చుట్టూ చక్కర్లు



స్మార్ట్ రేషన్ కార్డుల కోసం సచివాలయం వద్ద కార్డుదారులు

● నా పేరు స్రవంతి. మేము తిరుపతిలోని అశోక్‌నగర్‌లో ఉంటున్నాం. మా స్మార్టు రేషన్ కార్డు ఎక్కడ ఇస్తున్నారో తెలియక నాలుగు రోజులుగా జీవకోన, సత్యనారాయణ పురం, అశోక్‌నగర్, తుడా ఆఫీసు వద్ద వున్న సచివాలయాలకు వెళ్లి చూశాం. ఎవరిని అడిగినా సరైన సమాధానం లేదు. తీరా మా ప్రాంతానికి సంబంధంలేని ఓ వీఆర్వోను సంప్రదిస్తే జీవకోనలోని సచివాలయంలో ఉందన్నారు. అక్కడకు వెళ్లి అడిగినా సరైన సమాధానం లేదు. తీరా అదే జీవకోనలో పదో వార్డులో నా కార్డు ఉంది.

● నా పేరు మనోహరి. మాది బాలాజీ కాలనీ. ఇప్పటి వరకు మేము బాలాజీ కాలనీలోనే రేషన్ తీసుకుంటున్నాం. స్మార్టు కార్డు గురించి మా సచివాలయంలో వీఆర్వోని అడిగితే ఇక్కడకు రాలేదన్నారు. ఇంతకు ముందు ఎక్కడ కాపురమున్నారో అక్కడకు వెళ్లి తీసుకోండని చెప్పారు. అక్కడకు వెళితే మా కార్డు చింతలచేనులోని సచివాలయంలో ఉందన్నారు. అక్కడా నా కార్డు దొరకలేదు. ఇలా వారం రోజులుగా తిరిగినా.. ఇప్పటికీ దొరకలేదు.

.. ఇది స్రవంతి, మనోహరి సమస్యే కాదు. ఇలా ఎందరో స్మార్టు కార్డుల కోసం తిరుగుతున్నారు.

జిల్లా వ్యాప్తంగా దాదాపు 5,91,259 పాత కార్డులున్నాయి. కొత్తగా మరో 44,937 స్మార్ట్ రేషన్ కార్డులను ప్రభుత్వం మంజూరు చేసింది. ప్రస్తుతం ఎగ్జిస్టింగ్ కార్డులకే స్మార్ట్ రేషన్ కార్డులను సంబంధిత వార్డు సచివాలయాల్లోని వీఆర్వోలు, వెల్ఫేర్ కార్యదర్శుల ద్వారా పంపిణీ చేస్తున్నారు. అయితే, వైసీపీ ప్రభుత్వంలో చేసిన రేషన్ కార్డుల మ్యాపింగ్‌తో.. ఎవరి కార్డు ఎక్కడుందో తెలియక కార్డుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వారం రోజులుగా స్మార్టు కార్డులను పంపిణీ చేస్తున్నా చాలా మందికి వారి కార్డు ఎక్కడుందో తెలియని పరిస్థితి. దీంతో సచివాలయాల వద్ద కార్డుదారులు గుంపులుగా చేరుతున్నారు. తమకు స్మార్టు రేషన్ కార్డు వచ్చిందా.. లేదా అంటూ అధికారులను అడుగుతున్నారు. కొందరు డీలర్ల వద్దకెళ్లి కీ రిజిస్టర్ పరిశీలించినా అక్కడ కూడా కొంత మంది కార్డులు లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. దీనిపై అధికారులు స్పందించి కీ రిజిస్టర్ ఆధారంగా పంపిణీ చేస్తే కొంత వరకు సమస్య తగ్గుతుంది. దీనిపై జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శేషాచలం రాజును 'ఆంధ్రజ్యోతి' సంప్రదించగా, వచ్చే నెల ఒకటో తేది నుంచి డీలర్లు స్మార్టు కార్డులను అందజేస్తారని అన్నారు. అంత వరకు ఓపిగ్గా ఉండాలని సూచించారు.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

స్రవంతికి గిడుగు జాతీయ పురస్కారం



తిరుపతి(కల్చరల్), ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : తిరుపతికి చెందిన ప్రముఖ సైకాలజిస్ట్, సాహితీవేత్త, బహుముఖ ప్రజ్ఞాశాలి డాక్టర్ స్రవంతి ఐతరాజు గిడుగు జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. సాహిత్యం, వ్యక్తిత్వ రంగాల్లో ఆమె ఎంపికయ్యారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో గిడుగు రామ్మూర్తి పంతులు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 31వ తేదీన ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు.

తిరుపతికి చేరిన త్రిసేనల బుద్ధ సర్క్యూట్ యాత్ర

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): త్రిసేనల లార్డ్ బుద్ధ సర్క్యూట్ మోటార్ సైకిల్ యాత్ర శుక్రవారం రాత్రి 9గంటలకు తిరుపతికి చేరింది. కలెక్టరేట్ వద్ద వారికి డీఆర్వో నరసింహులు, జిల్లా పర్యాటకశాఖ అధికారి జనార్దన్‌రెడ్డి స్వాగతం పలికారు. ఈ యాత్రలో భారత రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన త్రిసేనల అధికారులు, అలాగే బిమ్‌స్టెక్ దేశాల నుంచి వచ్చిన ప్రతినిధులు పాల్గొన్నారు. బుద్ధుడి శాశ్వత సందేశమైన శాంతి, కరుణ, సౌభ్రాతృత్వంను దేశమంతటా వ్యాపించేటట్లు చేసే ప్రయత్నం జరుగుతోంది. బుద్ధ సర్క్యూట్ పేరిట సాంస్కృతిక, ఆధ్యాత్మిక మార్గాలను పునఃఅన్వేషించడానికి ఈ మోటార్ సైకిల్‌యాత్ర ఉపకరిస్తుందని కన్వీనర్ రాహుల్ పాటిల్ తెలిపారు. నేపాల్ నుంచి ప్రారంభమైన ఈ యాత్ర శ్రీలంక వరకు కొనసాగుతుందని పర్యాటక శాఖాధికారి జనార్దన్‌రెడ్డి తెలిపారు. ఈ బృందంలోని సభ్యులు శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకుని, ఆదివారం బయలుదేరతారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమాధికారి భరత్‌కుమార్‌రెడ్డి, సాంస్కృతిక శాఖ ప్రతినిధి మునికుమార్ పాల్గొన్నారు.





తిరుపతికి చేరుకున్న బుద్ధ త్రిసేనల సర్క్యూట్ యాత్ర - యాత్ర ప్రతినిధులతో డీఆర్వో నరసింహులు, పర్యాటకశాఖ అధికారి జనార్దన్‌రెడ్డి

అమ్మవారి సేవలో హైకోర్టు జడ్జి

తిరుచానూరు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులో వెలసిన శ్రీపద్మావతి అమ్మవారిని శుక్రవారం హైకోర్టు జడ్జి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప్ దర్శించుకున్నారు.ఆలయాధికారులు వారికి స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం ఆలయ వేదపండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్, ఏఈవో దేవరాజులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సుబ్బరాయుడు పాల్గొన్నారు.



పొలాల్లో ఏనుగుల గుంపు దాడి





పంట ధ్వంసం దృశ్యాలు



చంద్రగిరి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): చిన్నరామాపురం గ్రామ సమీపంలో గురువారం అర్థరాత్రి ఏనుగులు హల్‌చల్ చేశాయి. పంటపొలాలపై విరుచుకుపడ్డాయి. అర్ధరాత్రి దాటాక ఏనుగుల గుంపు గ్రామానికి చెందిన బొమ్మల మునిరత్నం, భారతికు చెందిన పొలంలో భీభత్సం చేశాయి. అక్కడ నుంచి సమీపంలోని పశువుల గడ్డి వామును నేలమట్టం చేశాయి. పంటలను తొక్కి నాశనం చేశాయని బాధిత రైతులు వాపోయారు. పొలాలకు వేసిన కంచెను సైతం ధ్వంసం చేసుకుంటూ చెరువు మార్గం ద్వారా అటవీప్రాంతంలోకి వెళ్లినట్లు వీరు చెబుతున్నారు. యేటా ఇదే రీతిలో పంట చేతికి అందకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారంతో పాటు ఏనుగుల కట్టడికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ముక్కంటి హుండీ ఆదాయం రూ.1.82కోట్లు



శ్రీకాళహస్తి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి హుండీల ద్వారా రూ.1,82,17,085 వచ్చింది. ఆలయ ఆవరణంలోని కొట్టు మండపంలో శుక్రవార హుండీ ఆదాయాన్ని లెక్కించారు. ప్రధాన హుండీలతో పాటు పరివార దేవతల వద్ద ఉన్న హుండీల ద్వారా బంగారం 58 గ్రాములు, వెండి 510.600 కేజీలు, విదేశీ కరెన్సీ 265నోట్లు వచ్చాయి. గత నెల 30వ తేదీ నుంచి ఈ హుండీ ఆదాయం వచ్చింది. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో బాపిరెడ్డి, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయ పాలకమండలికి 42 దరఖాస్తులు

తిరుపతి, ఆగస్టు29(ఆంధ్రజ్యోతి) : శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయ పాలకమండలిలో చోటుకోసం 42 మంది దరఖాస్తు చేసుకున్నట్లు ఈవో జయకుమార్ తెలిపారు. గంగమ్మ ఆలయ ట్రస్టుబోర్డు నియామకం కోసం దేవదాయ, ధర్మాదాయ శాఖ ఈనెల 7వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేసింది. 26వ తేదీలోపు ఆశావహులు దరఖాస్తు చేసుకున్నారు. సోమవారం ఉదయం 10గంటలకు ఆలయ ప్రాంగణంలో దరఖాస్తులను స్క్రూట్నీ చేస్తున్నామని, దరఖాస్తుదారులు హాజరుకావాలని ఈవో కోరారు.

పుత్తూరు వార్తలు

తెలుగును మరిచిపోతే అమ్మను మరిచినట్లే



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ చంద్రమౌళి

పుత్తూరు,ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): తెలుగు భాషను మరిస్తే అమ్మను మరిచినట్లేనని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి అన్నారు. కళాశాలలోని తెలుగు విభాగం ఆధ్వర్యంలో గిడుగు రామ్మూర్తి జయంతిని పురస్కరించుకుని తెలుగు భాషాదినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తెలుగు భాషాభివృద్ధి కోసం పలు తీర్మానాలు చేశారు. రాష్ట్రంలో తిరిగి తెలుగు మాధ్యమాన్ని ప్రవేశపెట్టాలని, చలన చిత్రాల పేర్లు తెలుగులోనే ఉండాలని, వృత్తి విద్యా కోర్సులలో తెలుగును ప్రవేశ పెట్టాలని తీర్మానించారు. తర్వాత మేధోసంపత్తి హక్కుల మీద జాతీయ స్థాయి వెబ్ సెమినార్‌లో తిరుపతిలోని మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల్లో అధ్యాపకులు వెంకటేశన్, మన్యం నరసింహులు, సుజన, వాణిశ్రీలు పాల్గొన్నారు.

అవనాక్షమ్మ సేవలో ఎమ్మెల్యే భానుప్రకాష్



పుత్తూరు అర్బన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): పుత్తూరు మండలం పరమేశ్వర మంగళంలో అవనాక్షమ్మ తిరునాళ్ల అత్యంత వేడుకగా నిర్వహించారు. శుక్రవారం ఎమ్మెల్యే భానుప్రకాష్ విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే వెంట పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజిమాధవయ్య తదితరులు ఉన్నారు.

● పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని పిల్లారిపట్టులో విజయగణపతి ఆలయ వార్షికోత్సవ ఉత్సవాలకు ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ హాజరయ్యారు.

సహకార సేవలను సద్వినియోగం చేసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న సందీప్

పుత్తూరు టౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రైతులు సహకార సంఘ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సహకార సంఘ కేంద్ర పుత్తూరు బ్రాంచ్ మేనేజర్ సందీప్ తెలిపారు. శుక్రవారం పుత్తూరు మండలం తడకు సహకార సంఘ కార్యాలయంలో కరుణాయాదవ్ అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సహకార సంఘాలు ద్వారా తక్కువ వడ్డీతో పంట రుణాలు తీసుకోవచ్చని తెలిపారు. రాయితీ పై ఎరువులు, విత్తనాలు పొందవచ్చనని తెలిపారు. డ్వాక్రా సంఘ సభ్యులు సంఘంలో చేరితో రుణ సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. డైరెక్టర్లు భాస్కర్‌శెట్టి, విజయభాస్కర్‌రెడ్డి, సూపర్‌వైజర్లు రాజేష్, సాయిశ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



స్మార్ట్ కార్డులు పంపిణీ చేస్తున్న గంజి మాధవయ్య

పుత్తూరు అర్బన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీతో రాష్ట్రం సరికొత్త ఒరవడికి శ్రీకారం చుట్టిందని రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య పేర్కొన్నారు. శుక్రవారం పుత్తూరు రూరల్ మండలం రామక్రిష్ణాపురం గ్రామపంచాయతీలో అర్హులకు స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అరవ బాలాజీ, ప్రధాన కార్యదర్శి హేమంత్, తడుకు సర్పంచ్ బొబ్బిలి యాదవ్, సింగిల్ విండో ప్రెసిడెంట్ కరుణాయాదవ్, డైరెక్టర్ విజయభాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ కోట గజపతి తదితర నాయకులు పాల్గొన్నారు.

● **అక్రమాలకు అడ్డుకట్ట**

రేషన్ షాపులలో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు స్మార్ట్‌కార్డులు ఉపయోగపడతాయని రాష్ట్ర వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ షణ్ముగరెడ్డి పేర్కొన్నారు. మిట్టపల్లూరు రేషన్ షాపు పరిధిలో స్మార్ట్ కార్డుల పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోపాల్ రెడ్డి, పట్టణ బీసీ సెల్ కార్యదర్శి సంతోష్, మణి, ఆర్ముగం రెడ్డి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన విద్యార్థుల అష్టావధానం



వడమాలపేట,ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్వీపురం ప్రాథమికోన్నత పాఠశాలలో రాచరికంలో అలనాటి సాంస్కృతిక పాఠవాలను నెమరువేసుకొంటూ విద్యార్థులు నిర్వహించిన అష్టావధానం ఆకట్టుకుంది. శుక్రవారం మాతృభాషా దినోత్సవం సందర్భంగా విద్యార్థులచే నిర్వహించిన భువనవిజయం స్థానికులను అబ్బురపరచింది. తెలుగు ఉపాధ్యాయులు రంగయ్యను స్థానికులు అభినందించారు.

క్రీడా ప్రతిభ హ్యాట్రిక్ అవార్డు ప్రదానం



అవార్డు అందుకుంటున్న పీడీ చంద్రశేఖర్‌రాజు

వడమాలపేట,ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): క్రీడా రంగంలో ప్రతిభ చూపిన విద్యార్థులుగా స్థానిక పీఎంశ్రీ బాలుర ఉన్నత పాఠశాల జిల్లా స్థాయిలో క్రీడా ప్రతిభ మూడవ అవార్డును దక్కించుకుంది. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా తిరుపతిలో శుక్రవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా సర్వ శిక్షా అభియాన్ అధికారులు గౌరీశంకర్, సురేష్ లు హెచ్ ఎం జయప్రద, పీడీ చంద్రశేఖర్ రాజులకు క్రీడా ప్రతిభ అవార్డును అందజేశారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

స్పేర్‌పార్ట్స్ దుకాణంలో అగ్ని ప్రమాదం



మంటలను అదుపుచేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

నాయుడుపేట టౌన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట రైల్వే స్టేషన్‌కు ఎదురుగా ఉన్న స్పేర్‌పార్ట్స్ దుకాణంలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. శుక్రవారం సాయంత్రం యజమాని తన సొంత పనుల నిమిత్తం దుకాణాన్ని మూసివేసి ఇంటికి వెళ్లాడు. కొంత సమయం తరువాత షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి పొగ అలుముకోవడంతో సమీపంలో ఉన్న దుకాణదారులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనాస్థలికి చేరుకొని మంటలను అదుపుచేశారు. అప్పటికే దుకాణంలో ఉన్న రూ.7 లక్షలు విలువచేసే సామాగ్రి దగ్ధమైనట్లు బాధితుడు ఫిర్యాదు చేశాడు.

సంగమేశ్వర ఆలయానికి సింహ వాహనం బహూకరణ



కోట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూడలిలో గల కామాక్షి దేవి సమేత సంగమేశ్వర స్వామివారి ఆలయానికి శుక్రవారం విద్యానగర్‌కు చెందిన స్వర్గీయ పృధ్వీసుందరయ్య జ్ఞాపకార్థం ఆయన భార్య సుదర్శనమ్మ, కుమారుడు సురేష్‌బాబు, అన్నపూర్ణమ్మ దంపతుల వితరణతో నూతన పంచలోహ సింహ వాహనాన్ని బహూకరించారు. ఆ వాహనాన్ని ఆలయ ప్రధానార్చకుడు కార్తీక్‌స్వామికి అందజేశారు.

నాయుడుపేట ఏఎంసీ పాలకవర్గం ఎంపిక

నాయుడుపేట, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని శుక్రవారం ప్రభుత్వం ప్రకటించింది. నాయుడుపేట ఏఎంసీ గౌరవ అధ్యక్షులుగా ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, అధ్యక్షుడిగా ఉయ్యాల ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా కిలారి గోపీ, సభ్యులుగా కాటూరి కోటేశ్వరరావు, కూచివాడ పవిత్రారెడ్డి, తుపాకుల కన్నెమ్మ, సీహెచ్ సుజాత, కామిరెడ్డి కేశవరెడ్డి, సీహెచ్ వేణయ్య, గోను బాబు, రాపూరు కస్తూరమ్మ, పాలూరు భాస్కర్, భైనా సుబ్రహ్మణ్యంరెడ్డి, కొండూరు సౌమ్య, గెంజి సుధాకర్, గెంజి సతీష్‌కుమార్‌లతో పాటు ఓజిలి పీఏసీఎస్ అధ్యక్షుడు, అగ్రికల్చర్ ఏడీఏ నాయుడుపేట, పెళ్లకూరు మండలం కొత్తూరు సర్పంచ్, జిల్లా అగ్రి ట్రేడ్ మార్కెటింగ్ ఆఫీసర్‌లను ఎంపిక చేశారు.

బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా వాకాటి

సూళ్లూరుపేట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా సూళ్లూరుపేటకు చెందిన మాజీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణ రెడ్డి నియమితులయ్యారు. గతంలో వాకాటి బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కూడా వ్యవహరించారు.

అమ్మవారిపేట మాజీ ఉపసర్పంచ్ కన్నుమూత

వెంకటగిరి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): బీసీ నేత అమ్మవారిపేట మాజీ ఉపసర్పంచ్ ఆవుల ఓబయ్య (80) శుక్రవారం రాత్రి కన్నుమూశారు. ఓబయ్య గతంలో అమ్మవారిపేట పంచాయితీ ఉప సర్పంచ్‌గా, మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధనరెడ్డికి ముఖ్య అనుచరుడిగా ఉండేవారు. అనంతరం టీడీపీలో చేరి 2014 ఎన్నికల్లో కురుగొండ్ల రామకృష్ణ గెలుపుకోసం కృషిచేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు నెల్లటూరు విద్యార్థి ఎంపిక



వెంకట్‌కార్తీక్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయురాళ్లు

గూడూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు నెల్లటూరు హైస్కూల్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థి వెంకట్‌కార్తీక్ ఎంపికయ్యాడని హెచ్‌ఎం పార్వతి అన్నారు. శుక్రవారం స్థానిక పాఠశాలలో ఆమె మాట్లాడుతూ తమ పాఠశాలకు చెందిన వెంకట్‌కార్తీక్ ఇటీవల నెల్లూరులో జరిగిన జిల్లాస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభచాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడన్నారు. ఈనెల 29 నుంచి 31వ తేదీ వరకు ఒంగోలు జిల్లాలో జరుగనున్న రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొంటాడని చెప్పారు. వెంకట్‌కార్తీక్‌ను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

అంత్యక్రియలకు బలిజ సంఘం చేయూత

నాయుడుపేట టౌన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట అమరాగార్డెన్‌లో నివసించే నిరుపేద కుటుంబానికి చెందిన ఇందుకూరు హంసమ్మ మృతి చెందారు. ఆమె అంత్యక్రియల కోసం శుక్రవారం నాయుడుపేట బలిజ సంఘ అధ్యక్షుడు పగడాల శివప్రదీప్, కార్యదర్శి హంసాపృధ్వీచంద్‌లు రూ.11వేలు అందజేశారు.

వైభవంగా చెంచుమహాలక్ష్మి వేడుకలు

పెళ్లకూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిల్లకూరు, జీలపాటూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన లక్ష్మీనరసింహస్వామీ సమేత చెంచుమహాలక్ష్మి ఆలయంలో శుక్రవారం వేడుకలను వైభవంగా నిర్వహించారు. చందనా అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. కోలాట భజనల నడుమ స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు ఆలయ పురోహితులు ప్రశాంత్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.

కాంగ్రెస్ శ్రేణుల ధర్నా

గూడూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక టవర్‌క్లాక్ వద్ద శుక్రవారం కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శి పంటా శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ఎలక్షన్ కమిషన్‌ను తన అధికార బలంతో ఉపయోగించుకుని కీలుబొమ్మలా మార్చివేసిందన్నారు. ఒకే చిరునామాతో వందల కొద్దీ ఓటర్లు ఉండడం, ఒకే వ్యక్తికి మూడు, నాలుగు రాష్ట్రాల్లో ఓటు ఉండడం వంటి అనేక పొరపాట్లు చోటు చేసుకున్నా పట్టించుకోలేదన్నారు. ఒక వ్యక్తి ఒకే ఓటు ఉండేలా ఆధార్‌కార్డుతో అనుసందానం చేయాలన్నారు. కార్యక్రమంలో పూల చంద్రశేఖర్, రామకృష్ణ, సుబ్బరామరాజు, చిరంజీవి, కరిముల్లా, బ్రహ్మయ్య, వేమయ్య, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనానికి ఏర్పాట్లు

గూడూరు అర్బన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): వినాయకచవితి సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమలను స్థానిక పంబలేరులో నిమజ్జనం చేసే సందర్భంలో ఎటువంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా పటిష్ఠ ఏర్పాట్లు చేశామని రూరల్ ఎస్ఐ మనోజ్‌కుమార్ అన్నారు. శుక్రవారం జాతీయరహదారిలో పంబలేరు వంతెన వద్ద నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు.సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నాయుడుపేటలో నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథుడు - పాతనాలపాడులో గణేష్ ఉత్సవాలను తిలకిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ - చిల్లకూరులో ఉట్టి కొడుతున్న యువకుడు

ప్రశాంతంగా గణేష్ ఉత్సవాలు

● **పాతనాలపాడులో ఉట్టికొట్టే ప్రక్రియను తిలకించిన ఎమ్మెల్యే కురుగొండ్ల**

డక్కిలి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): డక్కిలి మండలంలో శుక్రవారం వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. వేదికలను విద్యుద్దీపాలతో అలంకరించారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ స్వగ్రామమైన పాతనాలపాడు గ్రామంలో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహానికి శుక్రవారం ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం యువత ఉట్టికొట్టే కార్యక్రమాన్ని వీక్షించారు. మండలంలోని కమ్మపల్లిలో యువత కేరింతల నడుమ గణనాథుడి ఊరేగింపు జరిగింది. అనంతరం స్వామి వారి ప్రతిమను తెలుగుగంగ కాలువలో నిమజ్జనం చేశారు. డక్కిలిలో పేదలకు ఉభయ దాతలు అన్నదానం నిర్వహించారు. పలుచోట్ల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

నాయుడుపేట: నాయుడుపేట పట్టణ, మండలంలోని కొన్ని వినాయక విగ్రహాలను మేళతాళాలతో, యువత నృత్యాలతో రంగులు చల్లుకుంటూ నిమజ్జనానికి తరలించారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉట్టి మహోత్సవాల్లో యువత, చిన్నారులు పాల్గొని ఉత్సాహంగా ఉట్టిని కొట్టారు.

చిల్లకూరు: మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల వద్ద ఉట్టి, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. స్థానిక గొల్లపాలెం వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద చిన్నారులు, యువకులు చిందులు వేస్తూ ఉట్టి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

వెంకటగిరిటౌన్: పట్టణంలోని ఆనందపురం, మల్లమ్మగుడి వీధి, ఎన్టీఆర్ కాలనీ, బీసీ కాలనీ, బంగారుపేట తదితర ప్రాంతాల్లో వినాయక చవితి సంబరాలు శుక్రవారం జరుపుకున్నారు. చిన్నా పెద్ద తేడా లేకుండా ఉట్టి కొట్టి, రంగులు చల్లుకుంటూ సంబరాలు జరుపుకున్నారు. అన్నదానం నిర్వహించి, వినాయక ప్రతిమను రాపూరు రోడ్డులోని తెలుగుగంగ కాలువలో నిమజ్జనం చేశారు.

బాలాయపల్లి: మండల పరిధిలోని సుబ్రమణ్యం, కడగుండ గ్రామాల్లో వినాయక నిమజ్జన కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఉట్టికొట్టి సంబరాలు జరుపుకుని, అన్నదానం చేశారు.

కోట: మండల పరిధిలోని కోట, విద్యానగర్, ఉచ్చూరివారిపాళెంలతో పాటు పలు గ్రామాల్లో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా గణనాథుల గ్రామోత్సవం జరిగింది. ప్రకాశంకాలనీ, చెందోడు, కోట క్రాస్‌రోడ్లలోని గణనాథుల విగ్రహాలను మేళతాళాలమధ్య యువత కేరింతలు కొడుతూ శ్రీనివాససత్రం, తూపిలిపాళెం సముద్రాలలో నిమజ్జనానికి తరలించారు.

నెర్రి కాలువను పరిశీలించిన ఎమ్మెల్యే



నెర్రి కాలువ పనులను ఎమ్మెల్యే విజయశ్రీకి వివరిస్తున్న ఏఈఈ రమేష్, పక్కనే టీడీపీ నేత మాధవనాయుడు తదితరులు

సూళ్లూరుపేట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రైతులకు సాగునీరందించే నెర్రి కాలువను శుక్రవారం ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ టీడీపీ నాయకులతో కలిసి పరిశీలించారు. గత ఏడాది వరదలకు నెర్రి కాలువ పొర్లుకట్టలు దెబ్బతిని కోతకు గురైన విషయం తెలిసిందే. దీంతో వాటంబేడు, గోపాల్‌రెడ్డిపాలెం, పాములమిట్ట, కారిజాత గ్రామస్తులు నెర్రి కాలువ గండ్లను త్వరితగతిన పూడ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్నారు. ఇందుకు వెంటనే స్పందించిన ఎమ్మెల్యే జీఎన్‌టీ రోడ్డులో ఉన్న లూథరన్ చర్చి వెనకాల గండ్లు పడిన ప్రాంతాన్ని పరిశీలించారు. నెర్రి కాలువ పొర్లుకట్టకు రక్షణగా నిర్మిస్తున్న వాల్‌ను పరిశీలించి, ఇరిగేషన్ డీఈఈ కస్తూరయ్య, ఏఈఈ రమేష్‌లను వివరాలడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన పనులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. నెర్రి కాలువ గండ్లను పూడ్చి సాగునీరందిస్తామని ఎమ్మెల్యే రైతులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాధవ నాయుడు, పర్వతరెడ్డి చంద్రారెడ్డి, ఏలిమేటి సతీష్, బొమ్మన్ పళణి, బొమ్మన్ శ్రీధర్, మునీంద్రయ్య, రైతులు భాస్కర్‌రెడ్డి, మధు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తెలుగుభాషా దినోత్సవం



తెలుగుభాషా దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు - ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో విజేతలను అభినందిస్తున్న డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి తదితరులు

గూడూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తెలుగుభాష వ్యాప్తికి గిడుగు వెంకటరామమూర్తి ఎనలేని కృషిచేశారని శ్రీచైతన్య పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా స్థానిక శ్రీచైతన్య పాఠశాలలో గిడుగు రామమూర్తి చిత్రపటానికి నివాళులర్పించి, విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు వ్యవహారిక భాషకు రామమూర్తి ప్రాణం పోశారన్నారు. కార్యక్రమంలో హరిబాబు, హరిబ్రహ్మ, బాషా, వినయ్‌కుమార్, చందన, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక మినర్వా పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో వినోద్‌కుమార్, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శివప్రసాద్, ఝాన్సీరాణి, శ్రీధర్, నారాయణరాజు, డాక్టర్ పీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● సూళ్లూరుపేట: సూళ్లూరుపేటలోని వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎస్ఎల్‌బీ శర్మ ఆధ్వర్యంలో అధ్యాపకులు గిడుగు రామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అధ్యాపకులు వి.రాజా, సుబ్రమణ్యం, అమ్మాజీ పాల్గొన్నారు.

● కోట: మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, క్రీడా పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. శోభారాణి, మల్లికార్జునరెడ్డి, రామ్‌కుమార్, రామభాగ్య తదితరులు ఉన్నారు. అదేవిధంగా ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానంచేశారు. ఎన్‌సీసీ ఆఫీసర్ పి.శ్రీనివాసులు, కోఆర్డినేటర్ రాజేష్, ప్రసాద్, గాడె శ్రీనివాస్, డాక్టర్ వల్లీదేవి పాల్గొన్నారు.

● చిల్లకూరు: పారిచెర్లవారిపాళెం జడ్పీ ఉన్నత పాఠశాలలో గిడుగు రామమూర్తి, మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటాలు ఏర్పాటు చేసి నివాళులర్పించారు. హెచ్‌ఎం అనసూయ, మాధవయ్య, ప్రజేంద్రరెడ్డి, చంద్రశేఖర్, లావణ్య, శ్రీనివాసులు, రవీంద్ర, సంధ్యారాణి, మధుసూదన్‌రావు, విద్యుల్లత, సుగుణ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

షార్ ఉద్యోగుల కాలనీకి వెళ్లే పైపులైన్ లీకేజీ



సాయినగర్‌లో లీకేజి అవుతున్న పైపులైన్

సూళ్లూరుపేట, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): కాళంగి నది నుంచి షార్ ఉద్యోగుల కాలనీకి ఏర్పాటు చేసిన తాగునీటి పైపులైన్‌లో సాయినగర్ నెర్రికాలువ అంచున పైపు పగిలి తాగునీరంతా లీకేజీ కావడంతో ఆ ప్రాంతంలోని నివాసాల నడుమ రోడ్లపైకి చేరి జలమయంగా మారింది. శుక్రవారం స్థానికులు గుర్తించి మున్సిపాలిటీ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడకు చేరుకుని పరిశీలించి, అది షార్ ఉద్యోగుల కాలనీకి వెళ్లే పైపులైన్‌గా గుర్తించి వెంటనే షార్ అధికారులకు సమాచారం ఇచ్చారు. షార్ నీటి విభాగం వారు సాయంత్రం అక్కడకు చేరుకుని పైపులైన్‌కు మరమ్మతులు చేశారు.

ఒడిశా గవర్నర్‌ను కలిసిన టీడీపీ నేతలు



పిచ్చాటూరు, ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబును భువనేశ్వర్‌లోని రాజ్‌భవన్‌లో శుక్రవారం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు వెంపటి మాధవులనాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు.

ఎన్ఎంయూఏ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు

గూడూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ డిపో వద్ద శుక్రవారం నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అక్రమంగా సస్పెండ్ చేసిన కండక్టర్ శ్రావణ్‌కుమార్‌ను విధుల్లోకి వెంటనే తీసుకోవాలన్నారు. డిపో మేనేజర్ తన వైఖరిని మార్చుకోవాలన్నారు. ఇప్పటికే పలుమార్లు ఈ విషయమై ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. దీంతో నిరసన కార్యక్రమాలను ఉధృతం చేస్తున్నామన్నారు. ఉన్నతాధికారులు స్పందించి డిపోలో సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో అహ్మద్, ప్రవీణ్, బాషా, శ్రీనివాసులు, కృష్ణ, గౌస్, సందానీ, పోలయ్య, కమలాకర్, బాబురావు, రమేష్, సుధాకర్, శివ తదితరులు పాల్గొన్నారు.



రిలేనిరాహార దీక్షలు నిర్వహిస్తున్న ఎన్ఎంయూఏ నాయకులు

ఘనంగా మాతృభాషా దినోత్సవం



వేషదాధారణలతో ఉన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

నారాయణవనం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): నారాయణవనం మండలంలోని పాఠశాలల్లో శుక్రవారం మాతృభాష దినోత్సవాన్ని ఘనంగ నిర్వహించారు. పాలమంగళంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాతృభాష దినోత్సవాన్ని, మేజర్ ధ్యానచంద్ పుట్టినరోజును పురస్కరించుకుని క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం మనోహరి ఆధ్వర్యంలో విద్యార్థులు మాతృభాషపై పద్యపఠనం, బుర్రకథ, కోలాటం, నాటికలు ప్రదర్శించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల పింఛన్ల తొలగింపుపై అప్పీలుకు నేడు ఆఖరు



ఎంపీడీవో మాలతి

కేవీబీపురం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మండలంలో ఇటీవల తొలగించిన 179 దివ్యాంగుల పింఛన్లపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే శనివారం అప్పీలు చేసుకోవడానికి ఆఖరు రోజని ఎంపీడీవో మాలతి తెలియజేశారు. ఇప్పటికి 69 అప్పీళ్లు వచ్చాయని మిగిలిన వారు శనివారం లోపు చేసుకోవాలని ఆమె తెలిపారు.

శాస్త్రోక్తంగా గణపతి హోమం



గణపతిహోమంలో టీడీపీ నేతలు

శ్రీకాళహస్తి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి కొండమిట్టలో కొలువైన వినాయక ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా గణపతి హోమం జరిగింది. స్థానిక వార్డు మాజీ కౌన్సిలర్, టీడీపీ మీడియా కో-ఆర్డినేటర్ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మూడవ రోజు శుక్రవారం గణపతి హోమాన్ని జరిపించారు. భక్తులకు అన్నదానంచేశారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రంగినేని చెంచయ్యనాయుడు నాయకులు కంఠా రమేష్, వినయ్, ఉమేష్‌రావు, వజ్రం కిషోర్, రవి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కోలా ఆనంద్ ప్రమాణ స్వీకారం



మాధవ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కోలా ఆనంద్

శ్రీకాళహస్తి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): విజయవాడలోని బీజేపీ కార్యాలయంలో రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కోలా ఆనంద్ శక్రవారం బాధ్యతలు స్వీకరించారు. జాతీయ ప్రధాన కార్యదర్శి శివప్రకాష్, రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్, రాష్ట్ర సంఘటన మంత్రి మధుకర్ సమక్షంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు అవకాశం కల్పించిన కేంద్ర పెద్దలకు, రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో పలువురు ప్రముఖులు

శ్రీకాళహస్తి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శుక్రవారం పలువురు ప్రముఖులు వేర్వేరు సమయాల్లో దర్శించుకున్నారు. రాజస్తాన్ హైకోర్టు జడ్జి మున్నూరి లక్ష్మణ్, కేరళ హైకోర్టు జడ్జి ఈశ్వరన్ దర్శించుకున్న వారిలో ఉన్నారు. వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

నిత్యాన్నదానానికి రూ.50వేల విరాళం



శ్రీకాళహస్తి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యం లో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి తిరుపతి చెందిన సుబ్రహ్మణ్యం, జయలక్ష్మమ్మ దంపతులు శుక్రవారం రూ.50వేలు విరాళంగా అందజేశారు. ఆలయ అధికారులు దాతలకు దర్శన ఏర్పాట్లు చేశారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న న్యాయమూర్తి బేబీరాణి

శ్రీకాళహస్తి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలని ప్రభుత్వ ఇంటర్ కళాశాలలో విద్యార్థులకు శ్రీకాళహస్తి న్యాయస్థాన సీనియర్ సివిల్ జడ్జి బేబీరాణి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, బల్యవివాహాల నిర్మూలన, పోక్సో చట్టాలు, మహిళల హక్కులు తదితర వాటిపై అవగాహన కల్పించారు.

భక్తులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న డీఎస్పీ నరసింహామూర్తి

శ్రీకాళహస్తి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 18వ వార్డు పరిధిలోని ఈశ్వరయ్య గిరిజనకాలనీలో శుక్రవారం వినాయక చవితిని పురస్కరించుకుని సీపీఐ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య, పట్టణ కార్యదర్శి రొడ్డ గోపి, రెడ్డి వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు మహేంద్రరెడ్డి, ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షురాలు చారులత, శాఖ కార్యదర్శి మునెమ్మ, గంగమ్మ, పార్టీ పట్టణ నాయకులు మణికంఠ, మునిరాజాన, మధు, కాలనీవాసులు పాల్గొన్నారు.

వృద్ధులకు, దివ్యాంగులకు అన్నదానం



ఏర్పేడు, ఆగస్టు 29(ఆంధ్ర జ్యోతి): ఏర్పేడు మండలంలోని వికృతమాల నీలాద్రి అపార్ట్‌మెంట్‌లో లక్ష్మీ నరసింహ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆదర్శ నిలయంలోని వృద్ధులు, దివ్యాంగులకు పులిచెర్ల మండలం దిన్నుపాటి వారి గ్రామానికి చెందిన గుండ్లపల్లి తాతమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె కుటుంబ సభ్యులు శుక్రవారం అన్నదానం చేశారు. ఆషా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు జూలియస్ రాజు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ట్రస్టు వ్యవస్థాపకురాలు సైదమ్మ, తాతమ్మ కుటుంబ సభ్యులు ప్రభాకర్, హరిబాబు, చంద్రిక, తేజోవతి, ప్రజ్ఞ, గోవర్ధన్, దాము, ఏకాంబరం, రూకేష్ పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి రావిళ్ల భరోసా



శ్రీకాళహస్తి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): కార్యకర్త రమేష్ కుటుంబానికి టీడీపీ అండగా ఉంటుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు రావిళ్ల మునిరాజా నాయుడు భరోసా ఇచ్చారు. బోనుపల్లి ఎస్సీ కాలనీలో శుక్రవారం జరిగిన టీడీపీ కార్యకర్త రమేష్ అంత్యక్రియల్లో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దావులూరు రామానాయుడు, రాజేంద్ర, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి సత్యవేడు

అంబేడ్కర్ భవనానికి స్థల పరిశీలన

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో అంబేడ్కర్ భవనం కోసం మండల సముదాయంలోని భూమిని తహసీల్దార్ శ్రీదేవి శుక్రవారం పరిశీలించారు. ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అంబేద్కర్ భవనానికి ప్రభుత్వం నుంచి రూ. 30లక్షలు నిధులు మంజూరు చేయించడంతో భూమిని పరిశీలించామని తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఓ బాలమురళి, సచివాలయ సర్వేయరు హేమంత్ పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్ర సిబ్బందికి శిక్షణ

శ్రీకాళహస్తి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైతే సేవా కేంద్రంలో సిబ్బందికి తిరుపతి జిల్లా వనరుల కేంద్రం వారిచే శ్రీకాళహస్తి డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఆధ్వర్యంలో డివిజనల్ స్థాయి శిక్షణా కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాస్ కేవీకే విస్తరణ శాస్త్రవేత్త రామ్‌కుమార్ మాట్లాడుతూ రైతు ఉత్పత్తి సహకార కేంద్రాల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి వేణుగోపాల్, డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు రమేష్, డివిజన్ వ్యవసాయాధికారులు, వ్యవసాయ శాఖ సిబ్బంది, జిల్లా వనరుల కేంద్రం ఏఈవో రవిప్రసాద్ పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఇంటి పరిసరాలలో దోమలు చేరకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం ఆరోగ్య అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని జీఎన్‌కండ్రిగ గ్రామంలో శుక్రవారం ఫ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా గ్రామంలో మురుగు కాలువలు పరిశీలించారు. గ్రామస్తులకు, విద్యార్థులకు వేర్వేరుగా పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు అవగాహన సదస్సు

నారాయణవనం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): నారాయణవనం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో రైతులకు శుక్రవారం రైతులకు పర్సన్ ఇన్‌చార్జి నిరంజన్ బాబు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రభుత్వ పథకాలు, రుణాల మంజూరు గురించి వివరించారు. డిపాజిట్లు, సేవింగ్స్, కోతరుణాలు, ఇన్సూరెన్స్‌పై అవగాహన కల్పించారు. డీసీసీ బ్యాంకు మేనేజర్ సందీప్, సూపర్‌వైజర్ సాయి శ్రీనివాసులు, సంఘం సీఈవో బాలసుబ్రమణ్యం, సిబ్బంది విజయ్ పాల్గొన్నారు.

వేడుకగా ఊంజల సేవ

నారాయణవనం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): నారాయణవనంలో కొలువైన కల్యాణ వెంకన్న ఆలయంలో పద్మావతి అమ్మవారి ఊంజల సేవను శుక్రవారం వేడుకగా నిర్వహించారు. ఉదయం స్వామి, పద్మావతి అమ్మవార్లకు నిత్య కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని నూతన పట్టు వస్త్రాలు, ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ ఊంజల సేవ నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర్ భట్టాచార్య, శ్రీనివాసరాఘవ భట్టాచార్య, ఆలయా .దికారి నాగరాజు సిబ్బంది పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న శంకర్‌రెడ్డి

నారాయణవనం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): నారాయణవనానికి చెందిన గోపిక, భాస్కర్, అంబల తాండిలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శుక్రవారం టీడీపీ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ కూరపాటి శంకర్‌రెడ్డి అందజేశారు. లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలియజేశారు.

క్షుద్రపూజల కలకలం

సత్యవేడు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మదనంబేడు గ్రామంలో శుక్రవారం క్షుద్రపూజల కలకలం రేగింది. వెంకటేశ్వరస్వామి ఆలయం ఎదురుగా ఉన్న రోడ్డులో గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు క్షుద్ర పూజలు నిర్వహించిన ఆనవాళ్లు ఉండడంతో గ్రామస్తులు ఆందోళన చెందారు.

తెలుగు వెలుగులతో తెలుగు నేల వర్ధిల్లాలి





విద్యార్థులతో ఉమేష్‌రావు తదితరులు, ఏర్పేడు పాఠశాలలో తెలుగు కవుల వేషధారణలో ఆకట్టుకున్న విద్యార్థులు

శ్రీకాళహస్తి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): తెలుగు వెలుగులతో తెలుగు నేల వర్ధిల్లాలని టీడీపీ రాష్ట్ర బీసీ విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి ఉమేష్‌రావు అన్నారు. పట్టణంలోని ఎన్టీఆర్‌నగర్‌లో గల పురపాలక సంఘ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో తెలుగు భాష దినోత్సవాన్ని విద్యార్థుల మధ్య ఘనంగా నిర్వహించారు. తెలుగు భాషాభివృద్ధికి ఉపయోగపడే గ్రంథాలను వారికి ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిడుగు వెంకట రామమూర్తి ఉద్యమ ఫలితంగా వాడుక బాషలోనే రచనలు చేసుకుని నేడు మనమంతా చదువుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దశరథాచారి, వన్నెకుల క్షత్రియ సంక్షేమ సంఘం కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల రవి, తంగేళ్లపాళెం సింగిల్ విండో చైర్మన్ బీమాల భాస్కర్ ముదిరాజ్, నాయకులు వజ్రం కిషోర్, సయ్యద్ చాంద్‌బాషా, కోట చంద్రశేఖర్, మురళీనాయుడు, మణి, సంజాకుల మురళీకృష్ణ, భగత్, కృష్ణమూర్తి, మహ్మద్, భాస్కర్, హెచ్‌ఎం సురేష్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంజీఎం పాఠశాలలో.. ఎంజీఎం పాఠశాలలో విద్యార్థులు తెలుగు సంప్రదాయ దుస్తుల్లో హాజరయ్యారు. డైరెక్టర్ గుడ్లూరు మయూర్ మాటా ్లడుతూ తెలుగు భాష విశిష్టత ను వివరించారు. అలాగే క్రీడల దినోత్సం నిర్వహించారు. హెచ్‌ఎం మునిరత్నం నాయుడు ● ముచ్చివోలు జడ్పీ ఉన్నత పాఠశాలలోనూ తెలుగు భాష దినోత్సవాన్ని నిర్వహించారు.

ఏర్పేడు: ఏర్పేడు జడ్పీ ఉన్నత పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. హెచ్‌ఎం మునికుమారి అధ్యక్షులుగా వ్యవహరించారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. భానుప్రకాష్, వ్యాయామ ఉపాధ్యాయులు మణి, తెలుగు ఉపాధ్యాయులు మధు, హరిప్రసాద్, శైలజ, గోపి పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఇంటికే సీఎం సహాయనిధి



చెక్కు అందజేస్తున్న బొజ్జల బృందమ్మ

శ్రీకాళహస్తి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలువురు బాధితులకు సీఎం సహాయనిధిని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తల్లి బృందమ్మ ఇంటి వద్దకే వెళ్లి అందించారు. పట్టణానికి చెందిన మునెమ్మకు రూ.35,814, హరి సురేష్‌బాబుకు 18,998, చెంగమ్మకు రూ.35వేలు, పఠాన్‌బాషాకు రూ.44,422, బాలవెంకట సుబ్రహ్మణ్యంకు రూ.39,438, మానసకు రూ.9,94,192 మొత్తం రూ.11,67,864ను బాధితులకు అందించారు. సంవత్సర కాలంలో నియోజకవర్గంలో 147మందికి రూ.1,78,76,702 అందించామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్, నాయకులు కంఠా రమేష్, కాసరం రమేష్, గోపీనాథ్, షాకీరాలీ, గుర్రప్పశెట్టి, మునికృష్ణ, అస్మత్, ఖాదర్ బాషా, మస్తాన్, రేణుకమ్మ, మల్లీశ్వరమ్మ, షఫీ అమరావతి, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

ఏర్పేడు: ఏర్పేడు మండలం ఆమందూరు పంచాయతీ మాజీ సర్పంచ్ మురగయ్య భార్యకి వారి ఇంటి వద్ద బొజ్జల బృందమ్మ సీఎం సహాయనిధి రూ.63,223ను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు పేరం నాగరాజ నాయుడు, పేరం ధనంజయులునాయుడు, గుణయాదవ్, మునిరెడ్డి, రాచేటి సుబ్రహ్మణ్యం, కృష్ణవేణి, రమణయ్య, సుబ్రహ్మణ్యం, మనోహర్‌నాయుడు పాల్గొన్నారు.

మాతృభాషను మరువరాదు





బీఎన్‌కండ్రిగ కల్లివెట్టు పాఠశాలలో అ, ఆ అక్షరాకృతిలో విద్యార్థులు, తెలుగుతల్లి వేషధారణలో విద్యార్థినులు

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 29: మండలంలోని కల్లివెట్టు, బీఎన్‌కండ్రిగ, పల్లమాల ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఉపాధ్యాయులు, విద్యార్థులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తెలుగు తల్లి, ఇతర కవుల వేషధారణలో విద్యార్థునులు ఆకట్టుకున్నారు. అనంతరం జరిగిన సమావేశంలో అభ్యుదయ రచయితల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యువశ్రీ మురళి మాట్లాడుతూ వ్యవహారిక భాషోద్యమంతో తెలుగు భాషకు జీవం పోసిన గిడుగు రామమూర్తి తెలుగుజాతికి చిరస్మరణీయులని తెలిపారు. తెలుగు భాషా తెలుగు తల్లి పాల వంటిదని, పరభాష పోత పాల వంటిదని మాతృభాషను మరిస్తే మాతృమూర్తిని మరిచినట్లేనని తెలిపారు. అ, ఆ అక్షరాకృతిలో విద్యార్థులు తెలుగు భాషాభిమానం చాటుకున్నారు. విద్యార్థులకు పాఠశాలలో నిర్వహించిన సృజనాత్మకత భాషా పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం రమణయ్య, వాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'చిన్నయ్యగుంట డీలరు మాకొద్దు'

తహసీల్దారుకు గ్రామస్తుల వినతి



బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నయ్యగుంట గ్రామ డీలరు మునిశేఖర్ తమకు వద్దని గ్రామస్తులు తహసీల్దార్ శ్రీదేవికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డీలరు మునిశేఖర్ అవకతవకలకు పాల్పడటంతో ఆయన్ను అధికారులు తొలగించి వీఆర్‌ఓ ద్వారా రేషన్ సరుకులు అందిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం మళ్లీ మునిశేఖర్‌కు రేషన్ సరుకులు పంపిణీ బాధ్యతలు అప్పగించడం సరికాదన్నారు. విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు.

కోలాహలం గణేష్ నిమజ్జనం

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నీర్పాకోట, బీఎన్ కండ్రిగ, పల్లమాల, వెస్టవరత్తూరు, పుత్తేరి గ్రామాలలో ఘనంగా వినాయక నిమజ్జనం జరిగింది. వినాయకుడుకి ప్రత్యేక పూజలు చేసి విగ్రహాలను పూలతో అలంకరించి నైవేద్యం పెట్టారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. యువకులు ఉట్టికొట్టే ఉత్సవాన్ని కోలాహలంగా నిర్వహించారు.

ప్రిన్సిపాల్‌గా పదోన్నతి



శ్రీకాళహస్తి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఎస్సీయే ప్రభుత్వ జూనియర్ బాలుర కళాశాలలో జంతు శాస్త్ర అధ్యాపకురాలిగా పనిచేస్తున్న భారతి ప్రిన్సిపాల్‌గా పదోన్నతి పొందారు. తొట్టంబేడు మహిళా కళాశాలకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా అధ్యాపకులు ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుధాకరరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

గిరిబలిజ జీవో1793ను రద్దు చేయాలి



కేవీబీపురంలో రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న బలిజసంఘం నాయకులు

కేవీబీపురం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన దొమ్మరులను గిరిబలిజలుగా చేర్చే జీవో నెం.1793ని వెంటనే రద్దు చేయాలని బలిజ సంఘ కార్యదర్శి గోపీరాయల్ ప్రభుత్వాని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద రాయల్ పీపుల్ ఫ్రంట్ నాయకుడు కృష్ణయ్య ఆధ్వర్యంలో బలిజ కులస్తులు జీవో రద్దు చేయాలని ధర్నా నిర్వహించారు. అనంతరం వినతిపత్రాన్ని ఆర్‌ఐలు శ్రీనివాసులు, కరుణాకర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో బలిజసంఘం నాయకులు కాటముని, బొబ్బిలి, బాలసుబ్రహ్మణ్యం, ప్రభాకర్, చిరంజీవి, మునస్వామి, ధనంజయులు తదితరులు పాల్గొన్నారు.

నారాయణవనం: గిరి బలిజల జీవోను రద్దు చేయాలని బలిజ సేవా సంఘం నాయకులు తహసీల్దారుకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దొమ్మర కులస్తులను బలిజ కులస్తులుగా చేరుస్తూ ప్రభుత్వం జీవో 179 చేయడం విచారకరమని తెలిపారు. బాస్ నాయకులు గోపీరాయల్, శ్రీరామ్ గోపి, కృష్ణయ్య, బాలు, మునిబాబు, నాగరాజు పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రీడలపై ఆసక్తి ఉండాలి



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న క్షత్రియ సేవా సంఘం

నారాయణవనం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతో పాటు క్రీడల పట్ల ఆసక్తి కలిగి ఉండాలని కొండల చెరువు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాబు పేర్కొన్నారు. శుక్రవారం జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా కొండల చెరువుకు చెందిన జై శ్రీరామ్ వన్నెకుల క్షత్రియ సేవా సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. క్షత్రియ సేవా సంఘం అధ్యక్షులు శివారెడ్డి, హెచ్‌ఎం బాబు, క్షత్రియ సేవా సంఘం సభ్యులు, పాఠశాల కమిటీ చైర్మన్ రాజేష్, గ్రామ సర్పంచ్ భూపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం



మాట్లాడుతున్న అధ్యాపకులు

శ్రీకాళహస్తి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ దీనదయాల్ మాట్లాడుతూ హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని జాతీయ క్రీడా దినోత్సవంగా నిర్వహించుకుంటారని తెలిపారు. ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ మాలతి గాబ్రియేల్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థిని ఏదో ఒక ఆటలో పట్టు సాధించాలన్నారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అధ్యాపకులు నరసింహారావు, శైలజ, సాహితి పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



తెలుగు కవుల వేషధారణల్లో విద్యార్థులు

సత్యవేడు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో శుక్రవారం తెలుగుగు భాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. స్థానిక ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం భారతి ఆధ్వర్యంలో గిడుగు రామమూర్తి, గురజాడ అప్పారావు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. తెలుగు భాష గొప్పదనం తెలిపేలా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అదే విధంగా పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

వరదయ్యపాళెం: తెలుగుభాషా దినోత్సవం వేడుకలను మండలంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక జడ్పీ హైస్కూల్లో ఇన్‌చార్జి హెచ్‌ఎం సరస్వతి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు వివిధ కవుల వేషధారణల్లో అలరించారు. తెలుగుతల్లి, కుమ్మరి మొల్ల, తరిగొండ వెంగమాంబ, రుద్రమదేవి, ఫాతిమా షేక్, అల్లసాని పెద్దన, తెనాలి రామకృష్ణుడు, గిడుగు రామమూర్తి తదితరుల వేష ధారణల్లో ఆకట్టుకున్నారు. అదే విధంగా కార్యక్రమంలో హాకీ దిగ్గజం ప్రేమ్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా క్రీడా దినోత్సవం నిర్వహించారు.